Follow: @ANNTELUGU
17-02-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 77 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా భారత్

### భారత్ టెక్స్ 2025 ప్రారంభంలో ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా:** భారతదేశం ప్రపంచంలో ఆరవ అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 2030 నాటికి రూ.9 లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యమన్నారు. మా దృష్టి సాంకేతిక వస్త్ర రంగంపై ఉందన్న ప్రధాని, ఈ రంగంలో భారతదేశం తన ఉనికిని చాటుకుంటోందని అన్నారు. ఆదివారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన భారత్ టెక్స్ 2025 కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ మండపంలో మనం నాటిన విత్తనం ఇప్పుడు మర్రి చెట్టుగా మారే మార్గంలో ఉందని అన్నారు. భారత్ టెక్స్ ఇప్పుడు ఒక మెగా గ్లోబల్ టెక్స్‌టైల్ ఈవెంట్‌గా మారిందన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ నాయకులు భాగస్వామ్యం చేసుకోవడానికి, సహకరించుకోవడానికి ఒక వేదికను అందిస్తుంది. ఇక్కడికి వచ్చే ప్రతి వ్యక్తికి స్థానికం నుండి ప్రపంచానికి వెళ్ళే అవకాశం లభిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్ టెక్స్‌టైల్ రంగం ఒక ప్రధాన ప్రపంచ కార్యక్రమంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. 120 కి పైగా దేశాలు ఇందులో పాల్గొంటున్నాయని ప్రధానమంత్రి తెలిపారు.

**టాప్ న్యూస్**

## ఢిల్లీలో తొక్కిసలాటలో 18 మంది మృతి

- చివరి నిముషంలో ప్లాట్‌ఫామ్ మార్పడంతో దుర్ఘటన
- గాయపడ్డ వారిలో 9 మంది పరిస్థితి విషమం




03

## సీఎం సభకు తెచ్చిన పూల కుండీలు మాయం

- ఖంగుతిన్న నితీష్
- బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఘటన



03

## రాజీవ్ గాంధీ హిందువే కాదు

- ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ
- ఫిరోజ్ పూర్వీకులు ముస్లిం సంతతికి చెందిన వారు
- మరి రాహుల్ గాంధీ హిందువు ఎట్లా అవుతారు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్



03



## మళ్ళీ పాలు అమ్మిన మల్లారెడ్డి

- పాల డబ్బాల స్కూటర్‌పై సందడి
- కిస్సిక్ అంటూ ఫొటోలకు ఫోజులు

వివరాలు 2లో



## రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్

- కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు
- ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం.. బీజేపీకి 30 శాతం ఓట్లు
- ప్రజలందతా ఒకే భావన.. అది మోదీ భావన
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

వివరాలు 2లో



## రైతు కమిషన్ అంటే చులకనా?

- భగ్గుమన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పంజాబ్ తర్వాత తెలంగాణలోనే రైతు కమిషన్
- ఎన్నో సమస్యలపై అధ్యయనం.. పరిష్కారం

వివరాలు 4లో



# ఇదీ సార్ బ్రాండు
# మెగా VS అల్లు

## రెండు ఫ్యామిలీల మధ్య ఆధిపత్య యుద్ధం

వ్యూహంతో ఒకరు.. వ్యూహం లేకుండా మరొకరు
అల్లు అర్జున్ అరెస్ట్ తర్వాత మరింత వ్యూహాత్మకంగా అరవింద్
పెద్ద డ్యామేజ్ జరిగినా.. త్వరగా కోలుకున్న అల్లు ఫ్యామిలీ
నేషనల్ బ్రాండ్ బిల్డింగ్ పై ప్రత్యేక స్ట్రాటజీ
సినిమాల నుండి.. మార్కెటింగ్ వ్యూహాల దాకా.. తెరచాటు సంగతులు ఎన్నో
మెగా బేస్ అద్వితీయంగా ఉన్నా.. కోర్ స్ట్రాటజీ మిస్ అవుతోందన్న విమర్శలు
రానున్న రోజుల్లో మెగా క్యాంప్ కు మరిన్ని సవాళ్ళు..

**INSIDE STORY**

(కంది. రామచంద్రారెడ్డి)....................

మెగా వర్సెస్ అల్లు అంతా సవ్యంగా ఉందా? ఒక కుటుంబం.. రెండు క్యాంపులుగా అంతర్యుద్ధం సాగుతుందా? ఒకరినొకరు ఇన్ డైరెక్ట్ గా ఎద్దేవా చేస్తూ, ఒకరినొకరు అన్ ఫాలో చేసుకుంటూ కలివిడిగా కాక విడివిడిగా ఆధిపత్యం కోసం కొందరు తహతహలాడుతున్నారా? మెగా బ్రాండ్ ను వదిలి సొంత బ్రాండ్ ను క్రియేట్ చేసుకోవాలనుకోవడమే అల్లుకు సమస్యలు తెచ్చిపెట్టిందా? అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం తర్వాత మరింత ప్రణాళికా బద్ధంగా భవిష్యత్తును నిర్మించుకుంటున్నాడా? సినిమాప్రాజెక్టులే కాదు.. నేషనల్ బ్రాండ్ గా మారేలా కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాడా? ఇటు సినిమా, అటు పాలిటిక్స్ లో.. అల్లు వ్యూహాలేంటి? డిజాస్టర్ లు.. మంచితనం మించిన పొగడ్తలతో మెగా క్యాంప్ ప్లానింగ్ లు వెనుకబడుతోందా? తాము ఉపయోగపడడమే తప్ప.. తాము శాసించేలా పరిస్థితులను మార్చుకోవడం లేదా? దీపం ఉండగా ఇళ్ళు చక్కబెట్టుకోకుంటే.. భవిష్యత్ లో మెగా క్యాంప్ పెనుసవాళ్ళు ఎదుర్కొనే అవకాశముందా? రాజకీయవర్గాల్లోనే కాదు మెగా అభిమానుల్లో, సినీ అభిమానుల్లో మెగా అల్లు క్యాంప్ లపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

03




అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళకుండా

## ఏసీ గదులకు పరిమితం అవుతున్నారు

ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి


02



భర్తది ఏ కులమైతే.. భార్యది అదే కులం

## రాహుల్ ది బ్రాహ్మణ కుటుంబం

కిషన్, బండిలకు జగ్గారెడ్డి కౌంటర్



## కేశవ్ కుంజ్ రెడీ

### దేశం చూపు సంఘ్ కార్యాలయం వైపు

19న శివాజీ జయంతి సందర్భంగా నూతన కార్యాలయం ప్రారంభం
నూతన యుగంలోకి సంఘ్ పరిపాలన కేంద్రం
సంస్కృతి, సేవ, భవిష్యత్ వ్యూహాలకు మార్గదర్శక భవనం
హిందూ సంస్కృతి పరిరక్షణకు కొత్త ఉద్యమాల కేంద్రమైన కార్యాలయం
ఆధునికత, సంప్రదాయం సమ్మేళనంగా అత్యున్నత స్థాయి నిర్మాణ శిల్పం

02

# మళ్లీ ఆసక్తికర పోటీ..!

టీచర్ ఓటు కోసం అభ్యర్థుల వ్యూహాలు
ఓటర్లను ఆకర్షించేందుకు క్యాంపులు
అభ్యర్థుల వ్యూహాలతో బీజేపీ, కాంగ్రెస్
ఉపాధ్యాయులు మద్దతు ఎవరికో..!

**ఖమ్మం మహా:** ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు హోరాహోరీగా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇచ్చిన అభ్యర్థులు, స్వతంత్రులు - వీరంతా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి పోటీ మరింత రసవత్తరంగా మారింది. బీజేపీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ మద్దతుతో హర్షవర్ధన్ రెడ్డి, యూటీఎఫ్ మద్దతుతో అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్టీయూ మద్దతుతో శ్రీపాల్ రెడ్డి,

మిగతా 2లో




# మళ్ళీ ఆసక్తికర పోటీ..!

## టీచర్ ఓటు కోసం అభ్యర్థుల వ్యూహాలు

### ఓటర్లను ఆకర్షించేందుకు క్యాంపులు

### అభ్యర్థుల వ్యూహాలతో బీజేపీ, కాంగ్రెస్

### ఉపాధ్యాయులు మద్దతు ఎవరికో..!




(మొదటిపేజీ తరువాయి)

టీపీయూఎస్ అభ్యర్థులు - వీరు ఉపాధ్యాయుల మద్దతు కోసం పోటీపడుతున్నారు. అభ్యర్థులు ప్రచార వ్యయాలను పెంచి, క్యాంపులను నిర్వహించి, ఉపాధ్యాయులకు మరింత అనుకూలత కల్పించే విధంగా వ్యూహాలను అమలు చేస్తున్నారు ఈ ఎన్నికల్లో అభ్యర్థులు ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావిస్తూ, తమకు ఓటు వేసేలా చేయడానికి పలు హామీలు అందిస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పెన్షన్ విధానం, కాంట్రాక్టు ఉపాధ్యాయుల శాశ్వతీకరణ వంటి సమస్యలను పరిష్కరించేందుకు తమదైన విధానాన్ని ప్రవేశపెడతామని అభ్యర్థులు హామీ ఇస్తున్నారు. అయితే, ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు ఏ విధమైన వ్యూహాలు అవలంభిస్తున్నారు? ప్రచార వ్యయాలు ఎంతవరకు పెరిగాయి? ఓటింగ్ రోజుకు ముందే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు? అన్న విషయాలను విశ్లేషిద్దాం.

**ప్రచార వ్యూహాలు: ఉపాధ్యాయులను ఆకర్షించేందుకు కొత్త తంత్రాలు.**

ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులు కొత్త వ్యూహాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయసు పెంపు, ఆరోగ్య బీమా సౌకర్యాలు అందజేయడం, పింఛనుదారులకు మరిన్ని రాయితీలు కల్పించడం వంటి హామీలను ఇస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న హర్షవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయులకు 7వ పే కమిషన్ అమలు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించడం, కొత్త పదోన్నతుల నిబంధనలు అమలు చేయడం వంటి హామీలను ఇస్తున్నారు. యూటీఎఫ్ మద్దతుతో అలుగుబెల్లి నర్సిరెడ్డి తన అనుభవాన్ని ఉపయోగించి ఉపాధ్యాయులకు మరిన్ని లాభాలను అందిస్తానని చెబుతున్నారు.

ప్రత్యర్థుల కంటే తమ ప్రచారాన్ని ముందుండేలా అభ్యర్థులు భారీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్రచారాన్ని పెంచి, యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్ లైవ్ సమావేశాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా ఉపాధ్యాయులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**క్యాంపులు, ప్రలోభాలు: ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విస్తృత ఏర్పాట్లు.**

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు క్యాంపులను ఏర్పాటు చేశారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం ప్రాంతాల్లో వీరు ఉపాధ్యాయులను కలుస్తూ తమ మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా, బీజేపీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి తన మద్దతుదారులతో కలిసి ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక భేటీలు నిర్వహించారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న హర్షవర్ధన్ రెడ్డి క్యాంపులను పెంచి, టీచర్లకు వ్యక్తిగతంగా చేరువయ్యే ప్రయత్నం చేశారు.

ఈ క్యాంపుల్లో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించడంతో పాటు, వివిధ రకాల సౌకర్యాలు కల్పిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కొన్ని క్యాంపుల్లో ఉపాధ్యాయులకు ప్రయాణ సౌకర్యాలు, భోజనం, గృహవసతి సౌకర్యాలు కూడా అందిస్తున్నారు.

**ప్రస్తుత ఎన్నికల సరళి: ఉపాధ్యాయ ఓటు ఎవరికీ లాభించనుంది?**

ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పోటీ బీజేపీ, కాంగ్రెస్ మద్దతుగల అభ్యర్థుల మధ్యే జరుగుతోందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి ప్రభుత్వ విధానాలను విశదీకరించి, ఉపాధ్యాయుల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న హర్షవర్ధన్ రెడ్డి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను సిద్ధమని చెబుతున్నారు. ఇది చూస్తే, ప్రస్తుత ఎన్నికలు హోరాహోరీగా సాగనున్నాయి. ప్రచారం చివరి దశలో మరింత ఉత్కంఠత పెరిగే అవకాశం ఉంది. ఓటింగ్ రోజు ముందు అభ్యర్థులు మరిన్ని వ్యూహాలను అమలు చేసే అవకాశముంది. దీంతో, టీచర్ ఓటు చివరికి ఎవరికి లాభిస్తుందో వేచి చూడాలి!

ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొత్తం 24,905 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 14,940 మంది పురుషులు, 9,965 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,098 మంది, నల్గొండలో 4,483 మంది, ఖమ్మంలో 3,955 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో 163 మంది ఓటర్లు ఉన్నారు.

### ప్రచార వ్యయాలు

**ఓటు కోసం భారీగా ఖర్చు చేస్తున్న అభ్యర్థులు**

ప్రస్తుత ఎన్నికల్లో ప్రచార వ్యయాలు భారీగా పెరిగాయి. అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల కోసం, పోస్టర్ల ముద్రణ, బహిరంగ సమావేశాలు, ప్రయాణ ఖర్చుల కోసం కోట్యాధిక రూపాయలు వెచ్చిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రధాన అభ్యర్థులు ప్రచారానికి రూ. 5 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు కొన్ని మార్గాలను అనుసరిస్తున్నారు. ఓటర్లను టార్గెట్ చేయడం, వారి సమస్యలను నేరుగా వినడం, క్యాంపుల్లో వ్యక్తిగత సమావేశాలు నిర్వహించడం, ఉపాధ్యాయ సంఘాలను తమ వైపు తిప్పుకోవడం వంటి వ్యూహాలను అవలంభిస్తున్నారు.

# కేశవ్ కుంజ్ రెడీ

## దేశం చూపు సంఘ్ కార్యాలయం వైపు

19న శివాజీ జయంతి సందర్భంగా నూతన కార్యాలయం ప్రారంభం

నూతన యుగంలోకి సంఘ్ పరిపాలన కేంద్రం

సంస్కృతి, సేవ, భవిష్యత్ వ్యూహాలకు మార్గదర్శక భవనం

హిందూ సంస్కృతి పరిరక్షణకు కొత్త ఉద్యమాల కేంద్రమైన కార్యాలయం

ఆధునికత, సంప్రదాయం సమ్మేళనంగా అత్యున్నత స్థాయి నిర్మాణ శిల్పం



**మహా ప్రత్యేకం:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది స్వయంసేవకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నూతన ప్రధాన కార్యాలయ భవనం "కేశవ్ కుంజ్" ప్రారంభానికి సిద్ధమైంది. మహారాజ శివాజీ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 19న ఈ మహత్తర కార్యక్రమం జరగనుంది. ఈ ప్రారంభోత్సవానికి సంఘ్ అధినేత డాక్టర్ మోహన్ భగవత్ అధ్యక్షత వహించనుండగా, సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలే నేతృత్వంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు.

**ఐదు దశాబ్దాల చరిత్ర – కొత్త అధ్యాయం**

ఢిల్లీ ఝూన్డేవాలా సమీపంలో ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి 1939లో పునాది వేసారు. దేశవ్యాప్తంగా హిందూ సంస్కృతి పరిరక్షణకు ఈ కేంద్రం కీలకంగా మారింది. 1969లో మొదటి అంతస్తు, 1980లో రెండవ అంతస్తు నిర్మించగా, 50 సంవత్సరాల తర్వాత అత్యాధునిక సౌకర్యాలతో నూతన భవనం రూపుదిద్దుకుంది.

2016లో ఈ ప్రాజెక్ట్‌కు డాక్టర్ మోహన్ భగవత్ శంకుస్థాపన చేయగా, ఆరేళ్లలోనే ఈ విశిష్టమైన నిర్మాణం పూర్తి అయింది. భారతీయ సంప్రదాయ నిర్మాణ శైలికి ఆధునిక సాంకేతికతను జతచేసి, కాలానుగుణ మార్పులకు అనుగుణంగా అత్యున్నత స్థాయిలో నిర్మించారు.

**భారతీయ శిల్పకళకు నూతన నిదర్శనం**

నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఐదు లక్షల చదరపు అడుగులలో నిర్మించిన ఈ కార్యాలయ సముదాయాన్ని గుజరాత్‌కు చెందిన ప్రముఖ శిల్ప శాస్త్రజ్ఞుడు రూపొందించారు. గుజరాత్, రాజస్థాన్, భారతీయ సంప్రదాయ నిర్మాణ శైలిని ఈ భవనం ప్రతిబింబిస్తోంది.

**సంఘ్ కార్యాలయంలో విశేషమైన సౌకర్యాలు**

- ఈ కార్యాలయంలో 300 గదులు, మూడు పెద్ద సమావేశ మందిరాలు నిర్మించారు.
- అశోక్ సింఘాల్ భవనం - 463 మంది సామర్థ్యం కలిగిన ప్రత్యేక ఆడిటోరియం.
- ద్వితీయ సమావేశ మందిరం - 650 మందికి వసతి కల్పించే సమీకరణ కేంద్రం.
- తృతీయ సమావేశ మందిరం - 250 మంది సామర్థ్యం గల హాల్.
- ప్రెస్ కాన్ఫరెన్స్ కేంద్రం - ఆధునిక సాంకేతికతతో మీడియా సమావేశాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.
- పార్కింగ్ సౌకర్యం - 270 వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు.

**పర్యావరణ అనుకూలత – స్వచ్ఛ నిర్మాణ విధానం**

- సంప్రదాయ కలపకు బదులుగా గ్రానైట్ తలుపులు, కిటికీలు ఏర్పాటు చేశారు.
- మురుగునీటి శుద్ధి వ్యవస్థ (STP) ఏర్పాటు చేసి వ్యర్థాలను పూర్తిగా శుద్ధి చేయనున్నారు.
- 140 కిలోవాట్ల సామర్థ్యం గల సౌరశక్తి వ్యవస్థ ఏర్పాటు చేశారు.

**భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు**

- భవన సముదాయాన్ని నిరంతర సీసీ పర్యవేక్షణలో ఉంచారు.
- భద్రతను కేంద్ర పారామిలటరీ దళాలు పర్యవేక్షించనున్నారు.

**భారతీయ చైతన్యానికి ప్రతీక – భవిష్యత్ మార్గదర్శి కేంద్రం**

దేశ సేవా ధర్మానికి, సంఘ్ కార్యాచరణకు, హిందూ సంస్కృతి పరిరక్షణకు నూతన భవనం కేంద్రంగా నిలుస్తుంది. భారతీయ చైతన్యానికి ప్రతిబింబంగా నిలుస్తూ, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా కొనసాగనుంది.

### సంఘ్ కార్యాచరణకు మూడు విభాగాలు


సంఘ్ పరిపాలన, కార్యకలాపాలు, సేవా కార్యక్రమాలకు వీలుగా మూడు విభాగాలుగా భవన సముదాయాన్ని రూపొందించారు. సాధన విభాగం – పరిపాలన కేంద్రంగా ఉండే ఈ భాగంలో వివిధ ప్రచురణల కార్యాలయాలు, గ్రంథాలయం ఉన్నాయి. ప్రేరణ విభాగం – ముఖ్య కార్యకర్తల నివాసంగా ఉండే ఈ భాగంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. అర్చన విభాగం – ఇతర నగరాల నుండి వచ్చే సహాయక సిబ్బంది, సందర్శకుల బసకు ప్రత్యేకంగా రూపొందించారు.

# రైతు కమిషన్ అంటే చులకనా?

## భగ్గుమన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

### పంజాబ్ తర్వాత తెలంగాణలోనే రైతు కమిషన్

### ఎన్నో సమస్యలపై అధ్యయనం.. పరిష్కారం



**హైదరాబాద్, మహా:** రైతుల కోసం రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన స్వయం ప్రతిపత్తి కలిగిన రైతుకమిషన్ పై దుష్ప్రచారం జరగడం బాధాకరమని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి ఆదివారం అన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై మూడునెలల కాలంలోనే అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేసిందని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో పెట్టిన వాగ్దానం. అందులో భాగంగానే రైతు కమిషన్ ఏర్పాటుచేశామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి స్పష్టం చేశారు. సీఎం గా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే వ్యవసాయానికి పెద్దపీట వేయాలని, రైతు సంక్షేమానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వాలనే లక్ష్యంతో వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేశారని, దానిద్వారా వ్యవసాయము లాభసాటిగా ఉండడానికి వ్యవసాయంలో పెనుమార్పులు తేవాలన్నా కమిషన్ దోహదపడుతుందన్నారు.

**మూడు నెలలుగా ఎంతో అధ్యయనం**

రైతు కమిషన్ పూర్తి స్థాయిలో చైర్మన్, సభ్యుల నియామకం అయ్యి.. మూడు నెలలు అవుతోంది. ఈ మూడు నెలల కాలంలో.. అనేక అంశాలపై కమిషన్ చర్చలు జరిపింది. మరికొన్ని సమస్యల పరిష్కారం దిశగా సలహా సూచనలు చేసింది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేసింది. సాగు నీరు, విత్తనాలు, భూమి హక్కులు, పంట రుణాలు, రైతు ఆత్మహత్యలు లాంటి కీలక సమస్యలపై మేధోమథనం చేసి ప్రభుత్వానికి సలహాలు ఇచ్చింది. కొన్ని సమస్యల పై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమాచారాన్ని సేకరించింది. నిజామాబాదు లో పసుపు బోర్డు ఏర్పాటు, పత్తి రైతుల మార్కెట్ సమస్యల పై పార్లమెంట్ లో ప్రస్తావన, వరి విత్తనాల వలన నష్టపోయిన రైతులకు పరిహారం లాంటివి కమీషన్ కృషి తో సాధ్యపడ్డాయి. మరోవైపు సాంప్రదాయ పంటలైన చెరుకు, పసుపు తోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన చర్యలపై ఉద్యానవన శాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది కమిషన్. ఇక భూ గర్భ జలాలు పెంచుకోడానికి గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదికను అందించింది. గత ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ ను మేజర్ తో కలిపింది. దానిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసింది. మైనర్ ను మేజర్ నుండి విడదీసి.. ఆ చెరువుల నిర్వహణ గ్రామీణ ప్రాంతంలో వుండే నీటి సంఘాలకు అప్పగించాలని కోరింది కమిషన్. దానిపై ఒక పాలసీని తయారు చేసి మంత్రికి ఇవ్వడం కూడా జరిగిందని కోదండరెడ్డి వివరించారు. దేశంలో రైతు కమిషన్ పంజాబ్ రాష్ట్రంలోనే ఉందని, ఆ తర్వాత ఏర్పాటు చేసిన రాష్ట్రం మన తెలంగాణే అన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా కమీషన్ పని చేస్తుందన్నారు.



# రాహుల్ గాంధీ కులమేంటీ..?

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**వరంగల్, మహా:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కులమేంటీ..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు ఒకేతాను ముక్కలని ఆరోపించారు. ఆదివారం వరంగల్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గుడ్డెద్దు చేనులో పడినట్లుగా కాంగ్రెస్ పాలన ఉందని ఆక్షేపించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలతోనే పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. కులగణనకు బీజేపీ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.

### రాష్ట్రాన్ని అప్పుల పాలు

# చేసిందే కేసీఆర్

## కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు

ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం.. బీజేపీకి 30 శాతం ఓట్లు

ప్రజలందతా ఒకే భావన.. అది మోదీ భావన


: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



**సిద్దిపేట, మహా :** కేసీఆర్ పాలనలోనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారని, కాంగ్రెస్ పార్టీని కానీ కేసీఆర్‌ను కానీ ప్రజలు నమ్మే విధంగా లేరని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్ అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ నిలదీయడం ఎంటన్నారు. కాళేశ్వరంపై అధికారులను ప్రశ్నిస్తే కేసీఆర్ చెప్పినట్లే చేసామని చెబుతున్నారు. కేంద్రంలో 70 మందికి పైగా మంత్రులు ఉంటే.. అందులో 30 మందికి పైగా బీసీలే ఉన్నారని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

**ప్రజలదంతా ఒకే భావన**

పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి నరేంద్ర మోదీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రతిపక్షాల తీరు పార్లమెంటు లో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని ఈటెల రాజేందర్ అన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు.



### భర్తది ఏ కులమైతే.. భార్యది అదే కులం

# రాహుల్ ది బ్రాహ్మణ కుటుంబం

## కిషన్, బండిలకు జగ్గారెడ్డి కౌంటర్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌ది ఏ కులం, మతమో చెప్పాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గాంధీలపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలిసి మాట్లాడారా? తెలియక మాట్లాడారా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అంటే ఓ చరిత్ర అని, స్వాతంత్ర్య సంగ్రామం నుంచి వచ్చిన కుటుంబం వారిదని వివరించారు. రాహుల్ గాంధీ కుటుంబం బ్రాహ్మణులు, హిందువులు అని తెలిపారు. బ్రాహ్మణులు హిందువులు కారా? అని బండి సంజయ్‌కు ఏదైన డౌట్ ఉంటే ప్రశ్న అడగవచ్చని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గాంధీల కుటుంబం కులమతాలకు అతీతంగా ఉందని జగ్గారెడ్డి అన్నారు. ఆయన కుటుంబం ఎప్పుడూ రాజకీయంగా కులాన్ని వాడుకోలేదని చెప్పారు. దేశంలో హిందూ సంప్రదాయం ప్రకారం భర్తది ఏ కులమైతే.. భార్యది అదే కులం అవుతుందని వెల్లడించారు.

# మళ్ళీ పాలు అమ్మిన మల్లారెడ్డి

## పాల డబ్బాల స్కూటర్‌పై సందడి

### కిస్సిక్ అంటూ ఫొటోలకు ఫోజులు



**హైదరాబాద్, మహా:** పాలు అమ్మినా.. పూలు అమ్మినా.. కష్టపడ్డా.. సక్సెస్ అయినా.. అంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాను ఊపేసింది.ఇపుడు మళ్ళీ ఆయన పాల బండిపై కనిపించారు. ఆదివారం మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన మల్లారెడ్డి.. అక్కడ తనకు పాల డబ్బాతో కనిపించిన స్కూటర్‌పై ఎక్కి కూర్చున్నారు. పాల బండిని చూడగానే పాలు అమ్మిన రోజులను గుర్తుకొస్తున్నాయి.. అంటూ గుర్తు చేసుకున్నారు. ఇక పాల బండిపై ఎక్కి చక చక ఫోటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. మాస్ మల్లన్న పాల మల్లన్నగా కిస్సిక్ అని ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. మళ్ళీ పాలు అమ్ముతున్నారా? మల్లారెడ్డి సాబ్.. మీరొక తరానికి ఇనిస్పిరేషన్ అంతే అంటూ పలువురు కామెంట్స్ పెడుతున్నారు.




## సీఎం సభకు తెచ్చిన పూల కుండీలు మాయం

### ఖంగుతిన్న నితీష్

**బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఘటన**

**మహా:** తమ బస్తీకి రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని అధికారులు ముచ్చటపడి రకరకాల పూలమొక్కలు తీసుకొచ్చి అందంగా అలంకరిస్తే.. స్థానికులు చేసిన పనికి అంతా అవాక్కయ్యారు. తలోదిక్కు నుంచి వచ్చి దొరికిన కాడికి పూలమొక్కలు చేతబట్టి ఉడాయించారు. ఈ విచిత్ర ఘటన బీహార్‌లోని బక్సర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది స్పందించేలోపే స్థానికులు వందలాది కుండీలను మాయం చేశారు. ఈ కుండీలన్నింటనీ అధికారులు స్థానిక నర్సరీ నుంచి మున్సిపల్ కౌన్సిల్ ద్వారా అద్దెకు తీసుకు వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.



## ఢిల్లీలో తొక్కిసలాటలో 18 మంది మృతి

- చివరి నిముషంలో ప్లాట్‌ఫామ్ మార్చడంతో దుర్ఘటన
- గాయపడ్డ వారిలో 9 మంది పరిస్థితి విషమం

మహా: ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18 మంది చనిపోయారు. తీవ్రగాయాల పాలైన 18 మందికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతోంది. గాయపడ్డ వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాటపై పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు లోకి వస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి వస్తున్న భక్తుల సంఖ్యను అంచనా వేయడంలో రైల్వేశాఖ అధికారులు ఘోరంగా విఫలమైనట్టు విమర్శలు వస్తున్నాయి. రైళ్ల రాకపోకలపై తప్పుడు అనౌన్స్‌మెంట్ తొక్కిసలాటకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. చివరి నిముషంలో ప్లాట్‌ఫామ్ మార్చడంతో ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు.

## బెంగళూరులో ప్రతిష్టాత్మక సదస్సు

### కేటీఆర్‌కు ఆహ్వానం

**మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుకు ప్రతిష్టాత్మక సదస్సులో కీలక ప్రసంగం చేయాలని ఆహ్వానం లభించింది. టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్ 2025కు కేటీఆర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సదస్సు 2025 ఫిబ్రవరి 2728 తేదీల్లో బెంగళూరులో జరగనుంది. సదస్సు తొలి రోజున, డ్రైవింగ్ డిజిటల్ ఇండియా భవిష్యత్‌అవకాశాలు అనే అంశంపై కేటీఆర్ కీలక ప్రసంగం చేయనున్నారు. "ది ఏఐ టెకేడ్ " థీమ్‌తో నిర్వహించనున్న ఈ సమిట్‌లో, కృత్రిమ మేధస్సు వ్యాపారం మరియు సాంకేతికతపై చూపించే ప్రభావంపై ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ ప్రభుత్వాలు ప్రతినిధులు చర్చించనున్నారు.

## నేడు కేసీఆర్ బర్త్ డే

### రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలకు సన్నాహాలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సిటీలో ధూంధాం గా జరగనున్నాయి. నగరంలో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు క్యాడర్ జోష్ గా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి, నేతలు పర్యవేక్షణలో పాల్గొన్నారు.




# ఇదీ సార్ బ్రాండు మెగా VS అల్లు

**(కంది. రామచంద్రారెడ్డి)**

మెగా వర్సెస్ అల్లు అంతా సవ్యంగా ఉందా? ఒక కుటుంబం.. రెండు క్యాంపులుగా అంతర్యుద్ధం సాగుతుందా? ఒకరినొకరు ఇన్ డైరెక్ట్ గా ఎద్దేవా చేస్తూ, ఒకరినొకరు అన్ ఫాలో చేసుకుంటూ కలివిడిగా కాక విడివిడిగా ఆధిపత్యం కోసం కొందరు తహతహలాడుతున్నారా? మెగా బ్రాండ్ ను వదిలి సొంత బ్రాండ్ ను క్రియేట్ చేసుకోవాలనుకోవడమే అల్లుకు సమస్యలు తెచ్చిపెట్టిందా? అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం తర్వాత మరింత ప్రణాళికాబద్ధంగా భవిష్యత్తును నిర్మించుకుంటున్నాడా? సినిమాప్రాజెక్టులే కాదు.. నేషనల్ బ్రాండ్ గా మారేలా కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాడా? ఇటు సినిమా, అటు పాలిటిక్స్ లో.. అల్లు వ్యూహాలేంటి? డిజాస్టర్ లు.. మంచితనం మించిన పొగడ్తలతో మెగా క్యాంప్ ప్లానింగ్ లు వెనుకబడుతోందా? తాము ఉపయోగపడడమే తప్ప.. తాము శాసించేలా పరిస్థితులను మార్చుకోవడం లేదా? దీపం ఉండగా ఇళ్ళు చక్కబెట్టుకోకుంటే.. భవిష్యత్ లో మెగా క్యాంప్ పెనుసవాళ్ళు ఎదుర్కునే అవకాశముందా? రాజకీయవర్గాల్లోనే కాదు మెగా అభిమానుల్లో, సినీ అభిమానుల్లో మెగాఅల్లు క్యాంప్ లపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్ మామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయినా.. ఆయన తన ఆస్తుల విషయంలో, రాజకీయ విషయంలో ఉక్కపోత అనుభవించడం వెనుకా మెగా క్యాంప్ నీడలున్నాయనే అనుమానాలున్నాయి. ఇటీవల కాలంలో అల్లు అర్జున్ సాధించిన విజయాలు, ఎక్కిన శిఖరాలు.. ఎదుర్కొన్న సవాళ్ళు అనేకం. పుష్ప హిట్ తర్వాత ఎఎ జాతీయ స్థాయిలో బ్రాండ్ గా మారిపోయింది. పుష్ప 2 సినిమా చెప్పక్కర్లేదు. బిహార్ లో ఈవెంట్ పెట్టి కూడా.. జనజాతరను క్రియేట్ చేశాడు అల్లు అర్జున్, ఇలాంటి ఈవెంట్ లు.. విజయాలు, జన సందోహాలు, జేజేలు, పదవులు చిరంజీవి చూడనివి కావు. సినిమాల్లో చిరంజీవి ఎక్కని శిఖరం లేదు. అయితే ఇపుడు ట్రెండ్ మారింది. పరిస్థితులకు తగ్గట్లుగా సినిమా, పొలిటికల్, డిజిటల్ వ్యూహాలు అమలుచేయడం లేదా? లేక అంతా మనవారే అన్న భోళాతనం భోళాశంకర్ లా ముంచేస్తోందా? కారణాలు ఏవైనా.. అరెస్ట్ నుండి కోలుకుని అల్లు అర్జున్, అల్లు అరవింద్ అటు హిట్స్ కొడుతూ ఇటు సెలక్టివ్ గా, ట్రెండింగ్ గా ఉంటే.. ఇటీవల కాలంలో చిరంజీని పాల్గొన్న రెండు ఈవెంట్లు రచ్చగా మారాయి.

### రాజకీయం కూడా..

ప్రజారాజ్యమే జనసేనగా మారిందంటూ చిరు తాజా ఈవెంట్ లో సంచలన వ్యాఖ్యలు చేశారు. కానీ ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్ లో కలిపేసి కేంద్రమంత్రి పదవి తీసుకున్న చిరంజీవి అధికారికంగా కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పినట్లు ప్రకటించలేదు. ఇప్పటికీ చిరంజీవి మా వాడే.. అని కాంగ్రెస్ నేతలు అంటారు. పలు సమావేశాలకు సంబంధించిన ఆహ్వానాలు కూడా చిరంజీవికి వస్తుంటాయి. అయినా మోదీ ఆకర్షణలో, బిజెపి రాజకీయ వ్యూహంలో ఒకశిఖరం లాంటి నాయకుడు, శక్తి చిక్కుకున్నారన్న భావన ఆయనను అభిమానించే వారిలో ఉంది. అభిమానుల లెక్క ప్రకారం.. మోదీకి చిరంజీవి కావాలి. కానీ చిరంజీవికి మోదీ అవసరం లేదు. సోదరుడు పవన్ కల్యాణ్ ఎపి రాజకీయాల్లో సక్సెస్ అయ్యాడు. సోనియా గాంధీకి కూడా చిరంజీవి అంటే ఎంతో అభిమానం. ఎపుడైనా సోనియా పిలిస్తే ఊ అంటారేమోనన్నదే మోదీ భయమని, అందుకే అతి ప్రేమను బిజెపి నేతలు కెమెరాల ముందు కనబరుస్తారని ఆయన ఆదేశాలతో కాంగ్రెస్ లో విలీనమైన క్యాడర్ చెప్పుకుంటారు. చిరంజీవి ఓ సామాజికవర్గానికి.. ఐకాన్ గా, పెద్దన్నగానే రాజకీయ పెద్దలు భావిస్తున్నారని, చిరంజీవి వీటన్నింటికీ అతీతమైన శిఖరం లాంటి వ్యక్తిత్వమున్న నాయకుడని మరికొందరు పేర్కొంటున్నారు.

### ఆధిపత్యయుద్ధం ఉందా?

చెప్పను బ్రదర్ నుండి స్టార్టయిన రచ్చ.. ఏళ్ళుగా పెరుగుతూనే ఉంది. అల్లు అర్జున్ నంద్యాల శిల్పారవి ప్రచారానికి వెళ్ళడం పెద్ద రచ్చకు కారణమైంది. అప్పటి నుండి ఫ్యాన్ వార్ రోడ్డునపడింది. ఒకరి సినిమాలను మరొకరి ఫ్యాన్స్ దుష్ప్రచారం చేసేలా టీమ్ లు ఏర్పడ్డాయన్న ప్రచారాలు కూడా ఉన్నాయి. ఇదంతా పక్కనపెడితే అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం ఆకస్మికంగా జరిగినా, మెగాస్టార్ జోక్యం చేసుకుంటే పోలీస్ స్టేషన్ నుండే అర్జున్ ఇంటికి తిరిగి వచ్చేవారని అల్లు క్యాంప్ లో ఓ వాదన ఉంది. ఒకరోజు జైలులో ఉండాల్సిన పరిస్థితిని ఖచ్చితంగా మెగాస్టార్ అనుకుంటే నివారించి ఉండేవారని అల్లు అభిమానుల్లో ఆవేదన ఉంది. తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చిరంజీవి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ తో కూడా చిరంజీవికి ఉన్న సంబంధాలు ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రుల్లోనూ చాలా మందికి లేవు. ఇక గేమ్ ఛేంజర్ సరైన రీతిలో ఆడకపోగా, అప్పటి నుండి అరవింద్ వ్యూహాత్మకంగా పైచేయికి ప్రయత్నిస్తున్నాడన్న చర్చ కూడా మార్కెట్ లో జరుగుతోంది. ఒక సినిమా అధ.పాతాళానికి, మరో సినిమా సూపర్ డూపర్ హిట్ అయి దేవుడు బ్యాలెన్స్ చేశారని దిల్ రాజును ఉద్దేశించి అరవింద్ చేసిన వ్యాఖ్యలు నేరుగా మెగా ఫ్యాన్స్ ను, రామ్ చరణ్ ను తాకినట్లు తెలుస్తోంది. తర్వాత రామ్ చరణ్ ఫ్యాన్స్, మెగా ఫ్యాన్స్ ట్రోల్స్ చేశారు. ఇక మెగాస్టార్ పాల్గొనే ఈవెంట్లు ట్రోలింగ్ కు గురవుతుండగా, అల్లు అరవింద్ కొత్తగా డ్యాన్స్ నేర్చుకుని మరీ సినిమాలు, ఈవెంట్లను ట్రెండీగా మార్చేస్తున్నారు.

ఇక అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడిగా ఎంపిక కాగా, మెగా ఫ్యామిలీ కే కాదు.. తెలుగులోనే ఎవరూ అది సాధించలేదు. నటనతో పాటు ప్రణాళికలోనూ, సినిమాల ఎంపికలోనూ .. అల్లు టీమ్ లెక్క ప్రకారం వెళ్తుండగా,. మెగా క్యాంప్ లో మాత్రం మనోడు అనుకుంటే చేసేద్దామని సినిమా కెరీర్ ను కూడా డేంజర్ జోన్ లో స్వయంగా నెట్టుకుంటారన్న అపప్రద ఉంది. ఇక చిరంజీవి కొరటాల సినిమా డిజాస్టర్ పై ఎంత చర్చ జరిగిందో తెలిసిందే. గతంలో ఒక్క అల్లు అర్జున్ పై మాత్రమే ఆరోపణలు, చర్చలు జరిగేవి కాగా.. ఇపుడు అల్లు అరవింద్ పకడ్బందీ వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క సినిమాలే కాక ఇతర రంగాల్లో కూడా సమయం సందర్భం చూసుకుని అల్లు వారసత్వ బ్రాండ్ నిలిపేలా కొత్త ప్రణాళికలు తయారచేసుకున్నట్లు తెలుసక్తోంది. అల్లు అర్జున్ రాజకీయాల్లోకి రాబోతున్నట్లు గతంలో ప్రచారం జరిగింది. దీనిని ఆయన టీమ్ ఖండించినా.. ఒకసారి అది మొదలయ్యాక ఆరదని మెగాస్టార్ కూ తెలుసు, మెగా అల్లు ఫ్యామిలీల మధ్య నెలకొన్న విభేదాలు రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాల మీద ఎలాంటి ప్రభావం చూపుతాయోనన్న ఆసక్తి నెలకొంది.

## రాజీవ్ గాంధీ హిందువే కాదు

### ఆయన తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ

ఫిరోజ్ పూర్వీకులు ముస్లిం సంతతికి చెందిన వారు

రాజీవ్ గాంధీ భార్య సోనియా ఇటలీ దేశ క్రైస్తవురాలు

మరి రాహుల్ గాంధీ హిందువు ఎట్లా అవుతారు?.. కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలి

42 శాతం బీసీ రిజర్వేషన్ల ఇస్తే...అందులో 10 శాతం ముస్లింలకు పోతాయి

ఈ లెక్కన బీసీలకు తీవ్రమైన అన్యాయం జరిగినట్లే

కాంగ్రెస్ నేతలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**మహా:** రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వదేశీ మేళా'' ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండి సంజయ్ దాదాపు రెండు గంటలకుపైగా అక్కడే గడిపారు. ప్రతి స్టాల్ ను సందర్శిస్తూ స్వదేశీ ఉత్పత్తులను తిలకించారు. స్వదేశీ జాగరణ మంచ్ చేస్తున్న క్రుషిని అభినందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు…

ఇయాళ కాంగ్రెస్ నేతల మాట్లాడిన మాటలు టీవీల్లో చూసిన. తండ్రి కులమే కొడుకుకు వర్తిస్తుందని, రాజీవ్ గాంధీ హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్ గాంధీ కూడా హిందువేనని ఇయాళ కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరం. అసలు రాజీవ్ గాంధీ హిందువు ఎట్లా అవుతాడు. రాజీవ్ గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్ ఖాన్ పార్శీ మతస్థుడు. పర్సియాలోని ముస్లిం సంతతికి చెందిన వాళ్ల పూర్వీకులు ఇండియాకు వచ్చి పార్శీలుగా మారారు. ఫిరోజ్ జహంగీర్ ఖాన్ మతమే రాజీవ్ గాంధీకి వర్తిస్తుంది. కాబట్టి రాజీవ్ గాంధీ అసలు హిందూ కానేకాదు. ముస్లిం మూలాలున్న పార్శీ మతస్తుడు. టెన్ జన్ పథ్ లోని రాహుల్ గాంధీ కుటుంబానికి కులం, మతం, జాతి, దేశం లేదు… కానీ మోదీ పక్కా ఇండియన్. మోదీకి విదేశీయులే సాష్టాంగ నమస్కారం చేస్తున్నారు. విదేశాల్లో ప్రతి భారతీయుడు గర్వంగా ఇండియన్ అని కాలర్ ఎగరేసి తలెత్తుకుని తిరిగేలా చేస్తున్నారు. బీసీ కుల గణన పేరుతో హిందువులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ఒక వర్గానికి, మతానికి కొమ్ము కాసేందుకు కాంగ్రెస్ నేతలు బీసీల జనాభా తగ్గించే కుట్ర చేస్తున్నరు. 10 శాతమున్న ముస్లింలను బీసీల్లో కలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి… అందులో 10 శాతం ముస్లింలకే చెందుతాయి. ఈ లెక్కన బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తాయి. మరి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తీరువల్ల బీసీ న్యాయం కంటే అన్యాయం ఎక్కువ జరుగుతోంది. మహారాష్ట్రలో మాదిరిగా మత మార్పిడులు, లవ్ జిహాదీలపై చట్టం తీసుకురావాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అట్లాంటి చట్టమే తెలంగాణలోనూ తీసుకురావాలి. అంతే తప్ప ముస్లింలను బీసీ జాబితాలో కలిపి కేంద్రానికి పంపితే… ఆ జాబితాను కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. ఇందులో ఎలాంటి మొహమాటం లేనేలేదు. హిందూ ధర్మ సమాజం కోసం నిరంతరం పనిచేస్తాం. మమ్ముల్ని మతతత్వ వాదులుగా ముద్రవేసే భయపడే ప్రసక్తే లేదు. ఇకనైనా బీసీ జాబితాలో నుండి ముస్లింల జనాభాను తీసేసి కేంద్రానికి పంపిస్తే తప్పనిసరిగా ఆ జాబితా ఆమోదం పొందేలా చేస్తాం.

## అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళకుండా ఏసీ గదులకు పరిమితం అవుతున్నారు

### ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, మహా:** కొందరు అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళడానికి ఇష్టపడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి ఏ మెమరీ ఆఫ్ సివిల్ సర్వెంట్" అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన "లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి" పుస్తకంలో తాను సివిల్ సర్వెంట్ గా ప్రజల కోసం ఏమేం చేశారో.. ఎలాంటి కష్టాలు ఎదుర్కొని, విజయాలు సాధించారో పొందుపరిచారని అన్నారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి ఈ పుస్తకాన్ని చదివి.. గోపాలకృష్ణలాగ ప్రజల బాగు కోసం పాటు పడాలని సూచించారు. అధికారులు ప్రజాక్షేత్రంలో ఎంత తిరిగితే అంత మంచిది అని, ప్రజల అవసరాలు ఏంటో స్వయంగా తెలుసుకోవచ్చని అన్నారు. శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్ లాంటి అధికారులను ప్రతిక్షణం అధికారులు గుర్తు చేసుకుంటూ ఉండాలన్నారు. అయితే కొంతమంది అధికారులు ప్రజాక్షేత్రంలోకి వెళ్ళకుండా ఏసీ గదులకు మాత్రమే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశ పెట్టినా అవి అధికారుల ద్వారా మాత్రమే ప్రజలకు చేరతాయని, అధికారులు ఏసీ గదులు వదిలి రాకపోతే అవి ఏ విధంగా వారికి అందుతాయని ప్రశ్నించారు. గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారని.. గతంలో అధికారులు, రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే అందులోని లోతుపాతులు, లాభ నష్టాలను వివరించేవారని అన్నారు. కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయిందన్నారు. అధికారులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తెలియ జేశారు.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలన తరువాత కూడా.. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమే

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



**మహా:** స్వాతంత్రం వచ్చిన నాటినుంచి 14 మంది ప్రధానులు 65 ఏళ్లలో 56 లక్షలకోట్లు అప్పు చేస్తే.. 2014 నుంచి 2024 వరకు కేవలం పదేళ్లలోనే రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిన బీజేపీ ప్రభుత్వానికి అప్పులపై మాట్లాడే నైతిక హక్కే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణను బలవంతంగా ఆంధ్రలో కలిపిన నాడు కూడా తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రమేనని కేటీఆర్ స్పష్టంచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలోనూ రాష్ట్రానికి దాదాపు 70 వేల కోట్ల వరకు అప్పు ఉన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే బీఆర్ఎస్ పదేళ్ల పాలన తరువాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్ కు అప్పజెప్పామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అసలు అప్పులను, మిగులు బడ్జెట్ తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుగా తెచ్చిన ప్రతి పైసాను పెట్టుబడిగా మార్చి తెలంగాణ నేలపై విప్లవాత్మకమైన మార్పు తీసుకువచ్చిన విషయాన్ని యావత్ దేశం చూసిందని గుర్తు చేశారు. సమైక్యరాష్ట్రంలో తీవ్ర విధ్వంసానికి గురైన తెలంగాణ ముఖచిత్రాన్ని, తెలంగాణ ప్రజల బతుకు చిత్రాన్ని సమూలంగా మార్చి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అప్పులున్నంత మాత్రాన ఒక రాష్ట్రం వెనకబడినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం సరైంది కాదని స్పష్టంచేశారు. తెచ్చిన అప్పులను దేనికోసం ఖర్చుపెట్టారనేదే అత్యంత కీలకమైన విషయమన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లలో తెచ్చిన 125 లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పే పరిస్థితి లేదని, కానీ తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అప్పుతో దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మించామని తెలిపారు. వ్యవసాయంతోపాటు పారిశ్రామికరంగాన్ని వెంటాడిన చిమ్మచీకట్లను శాశ్వతంగా పారదోలేందుకు భారీ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి, మరోవైపు రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించిన విషయం తెలంగాణ సమాజానికి తెలుసని, వాటి ఫలితాలను రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో.. ఎఫ్.ఆర్.బీ.ఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటిఆర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లాగా తెచ్చిన అప్పులతో కార్పొరేట్ శక్తుల లక్షల కోట్ల లోన్లు మాఫీ చేయలేదనే విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తుపెట్టుకోవాలని కోరారు. పంటల దిగుబడిలో పంజాబ్ నే తలదన్నే స్థాయికి తెలంగాణ ఎదిగిందంటే దానికి ప్రధాన కారణం.. తెచ్చిన అప్పులతో సంపద సృష్టించే బృహత్తర కార్యక్రమాలు చేపట్టడమేనని కుండబద్దలు కొట్టారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 17-02-2025



# లైఫ్ @లాస్ట్ సీన్

మాయా పంజరాన
నీకు నువ్వే ఖైదీవవుతావు
కనపడని బరువుల, బాధ్యతల
బంధాలు నిన్ను కట్టిపడేస్తాయి
రెక్కలు విదిలించి రివ్వున పైకెగిరి
అందని స్వేచ్ఛను ముద్దాడాలని
పదే పదే నువ్వు ప్రయత్నాలు చేస్తావు
ఎంతకూ దక్కని ఫలితంతో
విసిగి వేసారి నిశ్చలమైపోతావు!

1
కోరికలకు వాస్తవ పరిస్థితులకు నడుమ
నీ పెనుగులాట గొంతుపెకలదు
ఆలోచించి ఆలోచించి
ఫినిక్స్ పక్షిలా మళ్లీ మళ్లీ
గాయపడుతుంటావు
పొద్దు నిన్ను ముద్దాడుతుంది
చీకటి నిన్ను కౌగిలించుకుంటుంది
నిద్ర నీకై పహారా కాస్తుంది
పదేపదే వెనక్కి తిరిగి చూసి
లోలోపలే ఆందోళన రాగాన్ని
ఎవరికీ వినిపించకుండా ఆలపిస్తుంటావు!

2
నీ ముందు రంగులు మారుతుంటాయి
కాలాలు చిగురులు తొడుగుతుంటాయి
నువ్వు మాత్రం తవ్వకాల్లో దొరికిన రాయిలా
గత వారసత్వాల సాక్షానివిగా మిగులుతావు!
సీజన్ల వారిగా దునియా
కొత్త పోకడలు పోతుంటే
నువ్వు నిశ్చేష్టుడువై చూస్తుంటావు
పరుగులు పెడుతున్న నీ తోటివారి ముందు
నువ్వు పందెనికి పనికిరాని గుర్రానివైతావు
ఎదురీతల నడుమ ఎడారుల్ని గెలుస్తావు
తలలు లేని మనుషుల నడుమ ఊపిరి బిగపట్టి
ఒక్క క్షణం నిట్టూర్పు విడుస్తావు
రేపటి మీద బండెడు భరోసాను పెట్టుకొని
జీవితాన్ని 'లాస్ట్ సీన్'లా చూస్తావు

3
మనుషుల విలువ
కాగితపు నోట్ల ముందు
బొక్కబోర్ల పడుతుంటది
కష్టాన్ని నమ్ముకున్నోడు
సగం ఖాళీ కడుపుతో
రోజులు లెక్కిస్తుంటాడు
అడ్డదారిలో అందలాలు అందుకున్నోడు
కోట్లకు పడగెత్తి నీ ముందు
ఖద్దరు బట్టలతో మిలమిలా మెరుస్తూ
పూటకో ఏషం కడుతుంటాడు
రీల్స్లా మారి బతుకులు
తాత్కాలిక ఉపశమనంలో సేదతీరుతుంటాయి

4
చిన్నగీతల పక్కన
ఎవడో పెద్ద గీతల్ని గీసి
నిన్ను మరుగుజ్జుగా నిలబెడతాడు
నటనే జీవితమైన
మనుషులు ముఖాలకు
నీతుల మాస్క్లు తొడుక్కొని
నీ చుట్టే తిరుగుతుంటారు
నిండా మునిగినోడే
నిండా ముంచుతుంటాడు
కుట్ర ఇప్పుడు బహిరంగ రహస్యం!



-పసునూరి రవీందర్,
63030 08268

## మల్లను

మాటకు ఎంతో యుక్తి ఉన్నదే మల్లనా!
ఎంతటి బాధనైనా
పంటి కిందనే అణచుకున్న జాషువా
శత్రువుల గుండెలు చెలించేటట్లుగా
పదునైన పద్యాల బాణాలు ఎక్కుపెట్టాడు
కుల అహంకారుల చేత
గండ పెండేరా మర్యాదలు పొందాడు!
విద్వేషం ఉద్రేకం కలగలిసిన చోట
చెలరేగేది ఉన్మాదమే!
మార్పు కోరుకునే చోట
మృదుత్వమే మలాం!
అధికార ధన వ్యామోహాలు
పెద్దల సభకు శోభ నీయవు
ఇప్పుడు ఎవరు ఏమీ దాచలేరు
వేదిక మీద మనం చెలరేగుతుంటే
వెనక వెక్కిరింతల సవ్వడి
నీకు వినిపించదు!
గెలుపు ఓటముల మధ్య
నిర్ణయాత్మకమైనది
సున్నితపు తెర మైనారిటీయే
రాజకీయ రహస్యం ఒంటపట్టడానికి
అధ్యయనం అనుభవం ఎంతో కావాలి!
ఎగిరెగిరి పడి తెగిపడ్డ గాలి పతంగిని
గమనించావా
ఏ చెట్టుకో ఉరేసుకుంటుంది!!



- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

## దు:ఖ గీతం

ఈ విషాద గీతానికి
పల్లవి ఎక్కడో అన్వేషిస్తున్నా!

కన్నీటి స్పర్శ తగులుతుంది
కళ్లెవరివో తెలియడం లేదు


లీలగా రోదన వినిపిస్తున్నా
మనసెవరిదోనన్న సందేహం

నొప్పి లేకుండానే గాయంలోంచి రక్తస్రావం!
నిశ్శబ్దం గొంతుల్లో హాహాకారాలు సమాధి!

పాదాల కింద చెమట చుక్కలు
భయాన్ని అదిమిపట్టాయి

పాటలోని చరణం
పల్లవికోసం తపిస్తుంది.
గాయకుడు
కవి నిట్టూర్పుల్ని లెక్కిస్తున్నాడు

కలం కాలం మూలాల్లో దాక్కున్న
రహస్యాల్ని శోధిస్తుంది.!
పాటలోని ఖాళీలను పూరించే సాధనలో శ్రోత
కన్నీటిచారికలా మెరుస్తున్నాడు!



- డా.ఎస్.రఘు, 9848208533

# రాయడం ఒక సైకాలాజికల్ నిర్బంధం.. చదవడం దాన్ని ఎగదోసే ఇంధనం

ఎవరు గానీ ఎందుకు రాస్తారు? డబ్బు కోసం, కీర్తి కోసం, అతిశయ ప్రదర్శన కోసం ...అని ఈ ప్రశ్నకు ఎన్ని సమాధానాలైనా చెప్పవచ్చు. కానీ ముఖ్యమైన , మౌలిక సమాధానం మాత్రం మరొకటుంది : అది స్వయం వ్యక్తీకరణ (self expression) కాంక్ష. దీని గురించి మాట్లాడుకునే ముందు, చెకోవ్ ప్రసిద్ధ కథ'Heartache'ని ఒకసారి గుర్తు చేసుకుందాం. ఇందులోని ముఖ్యపాత్ర , మాస్కో వీధుల్లో స్లెడ్జి బండి తోలి జీవనం సాగించే అయోనా పోతాపోవ్, ఈ లోకంలో తనకు మిగిలి వున్న ఒక్కగానొక్క కొడుకు జ్వరంతో బాధపడి నాలుగు రోజుల కిందట చనిపోయాడని సవారీ ఎక్కిన వాళ్లకి చెబుతాడు . మొదటి వ్యక్తి ఒక ఆఫీసర్ -'అలాగా , ఎప్పుడు , ఎలా' అని పొడిపొడిగా స్పందించి, పిదప అనాసక్తంగా మౌనం వహించి, తన గమ్యస్థానం రాగానే దిగి పోతాడు. దట్టంగా మంచు కురుస్తోన్న ఆ మునిమాపు వేళ కొన్ని గంటలు వేచి చూశాక మరో గిరాకీ తగిలి ముగ్గురు యువకులు బండి ఎక్కుతారు . బండి నడుపుతూ అయోనా మళ్ళా తన కొడుకు చావు ప్రస్తావన తెస్తాడు. 'లోకంలో రోజూ ఎందరో చస్తారు , నీ సోది మాకెందుకు చెబుతున్నావ్ బక్కపీనుగా ..' అని వాళ్ళు అతడ్ని కసురుకుంటారు , తిడతారు. 'బండి వేగంగా పోవడానికి నీ గుర్రాన్ని గట్టిగా అదిలియ్యి , ఇలా ..' అంటూ వాళ్ళలో ఒకడు అయోనా మెడ మీద చరుస్తాడు కూడా. దిగాల్సిన చోట వాళ్ళని దింపేసి వాళ్ళు నిర్లక్ష్యంగా విదిల్చిన చిల్లర డబ్బులు పుచ్చుకుని ఇక ఆ రోజుకి బండి కట్టడం చాలించాలని నిర్ణయించుకుంటాడు అయోనా . తన లాంటి వాళ్ళు రాత్రిపూట విశ్రాంతి తీసుకునే ఒక సత్రం లోకి వెళ్లి ఆ రోజు సంపాయించిన కొద్దిపాటి ఆదాయంతో గుర్రానికి దాణా కొని తన ఆకలి సంగతి మర్చిపోయి పొయ్యి దగ్గర కూర్చుంటాడు . కొంత సమయం గడిచాక, దాహంతో నిద్ర లేచి నీళ్ళ బకెట్ కోసం వెళుతున్నఒక వ్యక్తిని పలకరించి తన కొడుకు చనిపోయిన సంగతి అతనికి చెప్పే ప్రయత్నం చేస్తాడు, ఆ వ్యక్తి అయోనా మాటలు వినకుండా తన పని ముగించుకుని ముసుగు తన్ని గాఢ నిద్రలోకి జారుకుంటాడు .నిద్ర పట్టక ఎదలో దు;ఖం ఎగదన్నుకు రాగా అయోనా లేచి గుర్రం వద్దకు వెళ్లి, దాని మెడ కావలించుకుకుని, 'నా కొడుకు ఉత్త పుణ్యానికి చనిపోయాడు ,, ఈ లోకం విడిచి వెళ్లిపోయాడు..నువ్వు ఒక అమ్మవి , నీకొక బిడ్డ ఉందనుకో .. పిన్న వయసులోనే అది తనువు చాలిస్తే నీకు గుండె చెక్కలై పోదూ..' అని బోరున ఏడుస్తాడు, అతడు తన కొడుకు గురించి అంతా చెబుతూ పోతూంటే గుర్రం దాణా నములుతూ మెడ కదిలిస్తూ అతని చేతులపై వెచ్చని నిట్టూర్పులు వదులుతుంది .

సామూహికత, జిజ్ఞాస, భావ ప్రసారం మనిషి సహజాత లక్షణాలు. స్వయం వ్యక్తీకరణ (self expression) కాంక్షఅంటే మన ఆలోచనలు, అనుభూతులు, భావోద్వేగాలు ఇతరులతో పంచుకోవాలన్న వాంఛపై కథలో అయోనా పోతాపోవ్ తన గుండెలోని దు:ఖ భారం దించుకునెందుకు పడిన తపన లాగే బలీయమైనది .' You write because you feel the need to free yourself of something' అని టి.యస్. ఇలియట్ అనడం లోని ఉద్దేశం ఇదే. కలం పట్టడం తమ సామాజిక బాధ్యత అని భావించే సాహిత్యకారులకైతే అదొక సైకలాజికల్ , ఈస్థటిక్ నిర్బంధం కూడా అని మనకు తెలుసు.

అనంత ముఖ వైవిధ్యం గల జీవితాన్ని ఒక్కో మనిషి తన అనుభవ సారాన్ని బట్టి ఒక్కో రకంగా అర్థం చేసుకుని జీవిత సత్యాలు గ్రహిస్తాడు . పుట్టి పెరిగిన సామాజిక ఆర్థిక పరిస్థితులు , జీవనవిధానం, బయటి ప్రపంచంతో సంపర్కం , సమాజ పరిశీలన , అధ్యయనం ...ఇవి వ్యక్తి మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుతాయి, అతని చైతన్యాన్ని నిర్ణయిస్తాయి . మనిషి ఆలోచించగల, అనుభూతించగల, వివేచించగల, అవస్థలకు స్పందించి చర్యకు పూనుకోగల ప్రాణి; ఎంతటి ఉన్నత స్థాయి సమాజమైనా కాని వ్వండి అతని స్వేచ్ఛాతపన, సహజ కోర్కెలు, జీవిత లక్ష్యాలకు...వ్యవస్థీకృతమైన సంఘ మర్యాదలు , నీతి నియమాలు , రివాజులు..మొదలైన 'కట్టుబాట్ల'కు... నడుమ సామరస్యం కుదరదు కాబట్టి వ్యవస్థలతో సంఘర్షణ వుంటుంది. లోకం ఇలా ఎందుకు వుంది, ఇలా కాకుండా మరోలా వుంటే బాగుండు కదా అనే అతని ఆలోచనల, ఆకాంక్షల , ఆశలవిస్తృతికి వ్యక్తీకరణ రూపమే సాహిత్యం, ఇతర కళలూ. మనస్తత్వశాస్త్రీయ సూత్రాల ప్రకారంకళా సాహిత్యాల సృజన వెనుక మరో కారణమూ వుంది ;బాల్యదశ నుంచి మనిషి వ్యక్తిత్వనిర్మాణ(personality structure) క్రమంలో, వివిధ కారణాల వల్ల చోటుచేసుకునే, అంతశ్చేతన లోని న్యూనతాభావన( inferiority)కి పూరకంగా పాత్ర వహించే, ఆధిక్యతని లేదా ప్రత్యేకతని చాటుకోవాలని ప్రేరేపించే ఒకానొక అంతర్నిహిత లక్షణం 'creative self'(క్రియేటివ్ సెల్ఫ్) ఉత్ప్రేరకంగా ఉంటుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని, రాణిస్తున్న వారిని గమనించి నట్లయితే వారి సాధన, ప్రజ్ఞాపాటవాల వెనకాలి చోదకశక్తి ఇదేనని మనకు అర్థమవుతుంది.



(కాల్పనిక )సాహిత్యకారుడన్న వాడికి స్పందనాశీలత ,సంవేదనాగుణం సాధారణ స్థాయికన్నా అధికం అని నా అభిప్రాయం. అతడు సమాజంలో అందరి సరసనే ఉంటూ , సమాజ గమనాన్నిసామాజిక , ఆర్థిక , రాజకీయ పరిణామాలను, వాటి కార్యకారణ సంబంధాలను నిశితంగా పరిశీలిస్తూ, తన రచనల ద్వారామనిషి లోని నైతిక, మనస్తాత్విక విరోదాభాసలకు భాష్యం చెప్పే ప్రయత్నం చేస్తాడు. వర్తమాన పోకడల్ని తన కోణంలో విశ్లేషిస్తూ సమాజానికి కొత్త ఆలోచనలు అందిస్తాడు, అది తన బాధ్యతగా స్వీకరిస్తాడు .రచనావ్యాసంగాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించే స్థాయికి రావడానికి రచయితకు ఎంతో పరిణితి అవసరమవుతుంది. దానికి మంచి పరిశీలనాదృష్టితో పాటు, సాహిత్యాధ్యయనాభిలాష , పుస్తకపఠనానురక్తి పూర్వాపేక్షితాలుగా వుంటాయి.

**నా అనుభవం చెప్పాలంటే : సాహిత్యం , దాని ప్రయోజనం గ్రహిస్తూ కథా రచయితగా ఎదిగే క్రమంలో నేను విపరీతంగా పుస్తకాలు చదివేవాడిని. పుస్తక పఠనాన్ని, వివిధ దశల్లో , నేను ఆరు విధాలుగా ఆస్వాదించాను. అవి : 1.కుటుంబానికి సంబంధించిన ఆర్థిక పరమైన రొటీన్ సమస్యల నుంచి ఒక పలాయనం 2. కథల్లోని పాత్రల అనుభవాలతో మమేకమై కొత్త అనుభూతులు పొందడం 3. ఫాంటసీ ప్రపంచంలో విహరించడం 4. ప్రపంచం , మనిషి పరిణామం, నాగరికత వికాసం, మానవ సమాజ చారిత్రిక ప్రస్థానం, మనుషుల స్వభావ వైవిధ్యం... గురించిన పరిజ్ఞానం విస్తార పరచుకోవడం 5. సంభాషించే , భావాలు వ్యక్తీకరించే భాషాపరిజ్ఞానం ఇతోధికం చేసుకోవడం . 6.దేశ విదేశాల సాహితీ రీతుల అధ్యయనం తో సాహిత్య ప్రయోజనం పై , వివిధ సాహిత్య ప్రక్రియలపై ఒక మోస్తరు అవగాహన సాధించడం.**

ప్రాథమిక దశలో అంటే 1012 ఏళ్ల ప్రాయంలోచందమామ , బాలమిత్ర మాస పత్రికలు , ఇతిహాసాలకు సంబంధించిన బాలలబొమ్మల పుస్తకాలు చదవడం ప్రారంభించాను . చందమామ లో రంగురంగుల బొమ్మలు అందంగా, ఆకర్షణీయంగా ఉండేవి., బేతాళకథలు, నీతి కథలు, జానపద , చారిత్రిక గాథల సీరియల్స్, రామాయణ, భాగవత..తదితర పురాణాల ధారావాహికలు, అరేబియన్ నైట్స్ , జంగిల్ బుక్ , గ్రీకు కావ్యాల అనువాద భాగాలు ఆసక్తికరంగా చదివించేవి. 15 ఏళ్ల వయసులో ఇతర మాస, వార పత్రికలు , అపరాధ పరిశోధక నవలలు చదవడం అలవాటయ్యింది . ఆ తర్వాతి దశలో ఆంధ్రప్రభ , ఆంధ్రజ్యోతి , ఆంధ్రపత్రిక, ప్రగతి...వంటి సచిత్రవార పత్రికలు , జ్యోతి , భారతి, యువ వంటి మాస పత్రికల్లోని కథలు, కవితలు, సీరియల్స్, ఫీచర్స్ పట్ల ఆకర్షితుడినై ఆ కాలపు ప్రసిద్ధ రచయితలందరినీ చదివాను. సులోచనారాణి , కౌసల్యాదేవి , సీతాదేవి, రంగనాయకమ్మ , బీనాదేవి, రావిశాస్త్రి , కారా మాస్టారు , తిలక్..మొదలైనవారి రచనలు అలా పరిచయమైనవే.literary genre అంటే ఆసక్తి,అభిమానం పెరిగి చేతికందిన తెలుగు నవలలను ఆబగా చదివాను. రంగాచార్య , ఆళ్వారుస్వామి, పద్మరాజు, చలం, ఆరెస్ సుదర్శనం, వేణుగోపాలరావు ..ప్రభుతుల నవలలు ఒక కోణంలో ప్రత్యేకంగా కనిపించాయి.


సెమి -ఎంప్లాయ్మెంట్ లో భాగంగా మూడున్నరేళ్ళ శిక్షణ కాలం లో ఇతర రాష్ట్రాల్లో వున్నప్పుడు(1973 76) ఇంగ్లీష్ పత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాను . తెలుగేతర , భారతీయేతర సాహిత్యం పట్ల అప్పుడు బీజప్రాయంగా పడిన ఆసక్తి , అభిమానం తదనంతర కాలంలో పెరిగి పెద్ద వృక్షమైంది.( ప్రపంచ సాహిత్యం నోబెల్ , బూకర్ , లాటిన్ అమెరికన్ సాహిత్యం లో పేరెన్నిక గన్న ప్రముఖుల రచనల్ని లభ్యమైనంత మేర చదివాను.లారెన్స్, మెల్విల్లీ, కాఫ్కా, ఫాక్నర్ , వర్జీనియా ఉల్ఫ్, జేమ్స్ జాయ్స్ , శాలకోవ్ , హిమింగ్వే , మార్క్వెజ్ , సాల్మన్ రష్దీ, బెన్ ఓక్రీ, హార్పర్ లీ, కామూ , సార్త్ర ..ప్రభుతుల ఇతివృత్తాలు, రచనా శైలులు పరిచయమైనాయి. నాటి నుంచి నేటి వరకు తీరని ఆ పఠనపిపాస నాకొక వ్యసనంగానే పరిణమించింది .) సుమారు 25ఏళ్ల ప్రాయంలో వున్నప్పుడు రష్యన్ సాహిత్యం వేపు దృష్టి మళ్ళించాను తెలుగు లోకి అనూదితమైన చాలా పుస్తకాలు చదివాను. గోర్కీ , తాల్ స్టాయ్ , దోస్తోవ్ స్కీ, చెకోవ్ , ఆంద్రేయేవ్, లేర్మేన్తోవ్, కుప్రిన్..ప్రభుతుల రచనల సారం పట్టుకున్నాను. ఆ తర్వాతి అయిదారేళ్ళ కాలం ప్రగతిశీల సాహిత్య పత్రికలైన ప్రజాసాహితి, నూతన, జీవనాడి, అరుణతార..మొదలైనవి రెగ్యులర్ గా చదవడానికి, ఆ పిదప పూర్తిగా రాజకీయ , తాత్విక , వైజ్ఞానిక , చరిత్ర గ్రంథాల అధ్యయయానికి వెచ్చించాను.

సారాంశంగా నేను చెప్పవచ్చేదేమిటంటే :రచయిత కావడానికి ముందు నేను అందరిలాగే విరివిగా పుస్తకాలు , పత్రికలూ చదివాను. ఒక్కొక్క దశలో నేను ఒక్కొక్క genre పట్ల ఆకర్షితుడినై నా, దేని ప్రయోజనం దానికున్నది అని తెలిసినా, చివరకు సమాజ హితం కోరే నిజమైన సీరియస్ సాహిత్యవిభాగం literary genre అని గ్రహించాను. నా కన్నా ముందు వచ్చిన వాళ్ళ కథలు, నవలలు చదివాకే కాల్పనిక సాహిత్యం అంటే ఏమిటి, సమాజానికి దానితో ప్రయోజనం ఏమిటి, మన అనుభవాన్ని, ఆలోచనను లేదా ఒక జీవితశకలాన్ని ఎలా కథగా మలచవచ్చు, పలు పాత్రలను ఒక చట్రంలో ఇమిడ్చి , వాళ్ళ జీవితానుభవాలను విస్తారంగా చూపెట్టి , అంతర్లీనంగా ఒక కమ్యూనికేషన్ ఇస్తూ నవల ఎలా రాయవచ్చు ననేది తెలిసింది.

నిజ జీవిత అనుభవాలు, ఘటనలు, సంభావ్యతల ఆధారంగా రూపు దిద్దుకున్న కాల్పనిక రచన అయిన ఒక కథ / నవల అంతిమంగాపాఠకునిపై ఎలాంటి ప్రభావం చూపుతుంది, vicarious experience ఎలా అందిస్తుంది, పాత్ర(ల)తో పాఠకుడు తాదాత్మ్యం చెందేలా చేయడానికి అందులో ఎలాంటి కథా కథన నిర్వహణ వుంటుంది...ఈ విషయాలు నాకు కొమ్మూరి వేణుగోపాలరావు నవల ' పెంకుటిల్లు ' చదివాక తెలిశాయి .

**'60 వ దశకంలో ఆం. ప్ర . సాహిత్య అకాడెమి అవార్డు గెలుచుకున్నసుమారు 250 పేజీల నవల 'పెంకుటిల్లు 'ను నేను 1971 లో చదివాను. అదేకాలంలో ఆయన ఇతర నవలలు 'జాలిలేని జాబిలి' ,'హౌస్ సర్జన్','భారతి' చదివినట్టు గుర్తు . ఎనమండుగురు సభ్యుల ఒక మధ్య తరగతి కుటుంబం చుట్టూ అల్లిన 'పెంకుటిల్లు ' నన్ను బాగా ఆకట్టుకుని చాలాకాలం గుర్తుండి పోయింది.**

మట్టి , సున్నం , ఇటుకలతో కట్టిన లంకంత కొంప పెంకుటిల్లు పెద్ద ఆవరణతో ఉన్నా గోడలకు వెల్ల వేయక ఎన్నేళ్ళయిందో - వెలవెల బోతూ కళావిహీనంగా ఊరి కూడలి వద్ద నిలబడి ఉన్నట్టుగా వర్ణిస్తూ రచయిత అందులో నివసించే మనుషుల పేదరికాన్ని , నిరాశా నిస్పృహలను సూచ్యంగా చెబుతాడు. ఇంటి పెద్ద చిదంబరం సంపాదన కోసం ఏ పనీ చేయడు, చుట్ట కాలుస్తూ తన ఈడు దోస్తులతో పేకాట ఆడుతూ కాలక్షేపం చేస్తాడు. 'ఆదాయం, ఉద్యోగం లేకపోతె పాయే- చస్తే ఒకడి చేతి కింద పనిచేయను 'అని డాంబికాలు పోతాడు. పెద్ద కొడుకు నారాయణది బ్యాంకు లో ఉద్యోగం, వచ్చే



-ఆడెపు లక్ష్మీపతి

కొద్దిపాటి జీతంరాళ్ళ తోనే అప్రయోజకుడైన తండ్రిని , వృద్ధురాలైన నాయనమ్మని , కొండంత సహనంతో అన్నింటినీ భరిస్తూ పోయే తల్లి శారదాంబని , స్కూల్ విద్యార్థి ఐన తమ్ముడు వాసుని, నగరంలో లా కోర్సు చదువుతున్న మరో తమ్ముడు ప్రకాశాన్ని, పెళ్లి చేయాల్సిన పెద్ద చెల్లెలు రాధని , చిన్న చెల్లెలు చాయని పోషిస్తూ కాలం గడుపు కొస్తున్నాడు, ఉద్యోగం కోసం చదువు మధ్యలో ఆపేశాడు , కుటుంబ బాధ్యత తెంచుకోలేక పెళ్లి వద్దంటాడు. రాధది మరో రకం బాధఇంట్లో వాళ్లకు ఆమెను ఇంకా చదివించే ఉద్దేశం లేదు , పెళ్లి చేసే స్తోమత కూడా లేదు , పొరుగునున్న మగ పురుగుల వంకర చూపులు తప్పించు కునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తూ ఇంటి మీదే వుంటుంది. సర్కస్ చూడాలన్న కోరికతో కుర్రాడు వాసు పావలా డబ్బుల కోసం తప్పు మీద తప్పు చేసి ప్రమాదానికి గురై కాలు పోగొట్టుకుంటాడు . పట్నంలో ప్రకాశం ఒక దశలో చేతిలో చిల్లి గవ్వ లేని స్థితిలో తిండి లేక మూర్ఛిల్లుతాడు, ఇంటి వోనరు కూతురు శకుంతల సపర్యలతో కోలుకుంటాడు , నవల ముప్పాతిక భాగం తర్వాత అనూహ్య ఘటనలు వేగంగా జరుగుతాయి . శకుంతల తండ్రి చనిపోబోతూ ప్రకాశం నుంచి శకుంతలతో పెళ్ళికి వాగ్దానం తీసుకుంటాడు . నాయనమ్మ ఆఖరి కోర్కె తీర్చడం కోసం నారాయణ సుగుణ అనే అమ్మాయిని పెళ్ళాడతాడు. చిదంబరం పెద్ద కూతురు అన్నపూర్ణ ప్రసవసమయంలో మరణిస్తుంది . ఆమె పెనిమిటి రాధ ను పెళ్లి చేసుకుంటాడు. గతం లో అప్పు ఇచ్చిన ఒక మిత్రునితో చిదంబరం తీవ్రంగా పోట్లాడి అతని చావుకు కారణమవుతాడు , ఫలితంగా మూడేళ్ళ జైలు శిక్ష అనుభవిస్తాడు. జైలు నుంచి విడుదలయ్యాక , సుఖ సంతోషాలతో కళకళలాడుతూ కొత్తగా కనిపిస్తోన్న పెంకుటింటి లోకి ప్రవేశించడానికి మనసొప్పక వెనుదిరిగి వెళ్లి పోతాడు.

'పెంకుటిల్లు ' నవల, ఇతివృత్తం నన్ను ఆకట్టుకోవడానికి కారణం -అందులో వర్ణించిన ఇంటి వాతావరణం , ఆర్థిక పరిస్థితులు , పాత్రల ప్రవర్తనలు, సంకట స్థితులతో నేను ఒక మేరకు కనెక్ట్ కావడం. నేను పుట్టిన, బాల్యం గడిపిన, 30 ఏళ్ల వయసు దాటే వరకు అనుబంధం కొనసాగిన.. ఇల్లు పల్లెటూరిలోని మా పెద్ద పెంకుటిల్లు . రెండు దిక్కులా పెద్ద వాకిలి తో , కప్పును దాదాపు రాసుకుంటూ విశాలంగా విస్తరించిన చింత చెట్ల కొమ్మలతో, కాలాన్ని బట్టి చల్లగా, వెచ్చగా ఉండిన కుమ్మరిగూన పెంకుటిల్లు అది. అమ్మా, నాన్న, నాయినమ్మ, అయిదుగురు అన్నదమ్ములు..మొత్తం కలిపి మా దిగువ మధ్యతరగతి కుటుంబంలో ఎనమండుగురు సభ్యులం. మా నాన్న కష్టజీవి, గని కార్మికుడు. ఆయన ఒక్కడి జీతంతో ఇంటి అవసరాలు, పిల్లలకు బట్టలు, పుస్తకాలు, ఫీజులు, ఇతర ఖర్చులు వెళ్ళదీస్తూ మా అమ్మ పొదుపుగా, తెలివిగా సంసారాన్ని ఈదుకొచ్చింది. అయిదుగురు అన్నదమ్ములలో నేను మూడోవాడిని. 'పెంకుటిల్లు' నవల చదూతున్నప్పుడు పావలా కోసం వాసు పడిన సంకట స్థితితో నేను ఐడెంటిఫై అయ్యాను. హైస్కూల్ రోజుల్లోనూ సినిమా చూసేందుకు కేవలం 35 పైసల( నేల టికెట్టు) కోసం వెంపర్లాడినసందర్భాలు నాకింకా గుర్తున్నాయి. ప్రకాశం , శకుంతలల రోమాన్స్ ఘట్టాలు, భావ గర్భితమైన వారి సంభాషణలు ఆసక్తిగా చదువుతూ, కౌమార దశలోకి అడుగిడుతున్నప్పుడు మదిలో సహజంగా చెలరేగే స్త్రీపురుషుల నడుమ ఆకర్షణకి సంబంధించిన ఆలోచనల రుచి మళ్ళీ మళ్ళీ ఆస్వాదిస్తూ ఫాంటసీ లోకి వెళ్లిపోయాను. 'పెంకుటిల్లు' నవల నన్ను ఆకట్టుకోవడానికి పై కొన్ని కారణాలు ఒక ఎత్తయితే , ఆ కాలపు విశ్వాసాలు , మనుషుల మనస్తత్వాలు, సామాజిక దృక్పథాలు పొందుపరిచి , పాఠకుల సానుభూతి చూరగోనేలా పాత్రలను తీర్చిదిద్ది , ఆద్యంతం ఆసక్తికరంగా కథనం నడిపిన రచయిత ప్రతిభ మరో ఎత్తు. ఇందులో సమకాలీన జీవితం, మానవ సంబంధాల గాఢత మిళితమై అనేక ఘటనల, సన్నివేశాల సమాహారమైన నవల గా రూపు దిద్దుకున్న తీరుసాహిత్య ప్రయోజనం గురించిన నా సానుకూల అభిప్రాయాన్ని మరింత బలోపేతం చేసిందని చెప్పగలను.


## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం
కవులు, రచయితల
నుండి కథలు, కవిత్వం,
సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు
మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన
చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp
9247580946

# వైవిధ్య భరితమైన కథల సంపుటి

ఈ మధ్య వైవిధ్య భరితంగా కథలు రాస్తున్న యువతరంలో శ్రీ ఊహ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీరు ఈసారి వస్తు పరంగా, శిల్ప పరంగా కొత్తదనం నిండిన కథల సంపుటి "బాల్కావ్" తో మన ముందుకు వచ్చారు. ఇందులో మొదటి కథ "ధూల్ పేట లడాయి". ఇందులో ఒక ధూల్ పేట యువకుడు ఉద్యోగం కోసం వెతుకుతూ ,మరుగుదొడ్లు కడిగే పనికి ఒప్పుకుంటాడు. యజమాని అతన్ని పోలీస్ స్టేషన్ నుండి కాంటాక్ట్ సర్టిఫికెట్ తెమ్మంటే, దానికోసం ఎంత ప్రయత్నించినా లాభం లేక సెటిల్మెంట్ పనిలోకి దిగుతాడు. సెటిల్మెంట్ పేరుతో బెదిరింపులు అనుకుంటాడు. కానీ వాళ్ళు ఒక వ్యక్తిని హత్య చేయడం చూసి తట్టుకోలేక పోతాడు. కొసమెరుపు ఏమిటంటే ఇంజనీరింగ్ కాలేజీ దగ్గర వాళ్లు హత్య చేసింది జార్జి రెడ్డి అనే విద్యార్థి నాయకుడిని .ఇది అప్పట్లో ఎంత సంచలనమో అందరికీ తెలిసిందే. కథ అంతా బాగానే ఉంది. కానీ దూల్ పేట వాసులు ఒకరికింద పనిచేయడానికి ఇష్టపడరు. అందునా మరుగుదొడ్లు కడిగేలాంటి నీచపు పనులు వాళ్ళు ఒప్పుకోవడం అసంభవం. ఈ విషయాన్ని పక్కన పెడితే కథను నడిపిన విధానం ఆకట్టుకుంటుంది. ఎంతో తెలివైన వాడైన చయనులు హఠాత్తుగా తండ్రి చనిపోగా, చదువు పూర్తికాక, ఉద్యోగం దొరకక, పౌరోహిత్యం దక్కక, చివరకు శవాలు మోసేవాడిగా తయారవుతాడు. కులస్తుల ఈసడింపులు భరిస్తూనే ఉన్నంతలో ఇతరులకు సహాయపడుతుంటాడు. హఠాత్తుగా కలిసిన చిన్ననాటి మిత్రుడు బోస్ ,చయనులును



చూసి సంబరపడిపోతాడు. ఇద్దరు కలిసి ఆనాటి స్కూల్ రోజులు, అప్పటి ఆశలు కోరికలు అన్ని జ్ఞాపకం చేసుకుంటారు. పక్కనోడిని బాగు చేయలేని నా ధర్మం ఎవరికి కావాలి? అని ఈసడించుకున్న చయనులు మనసు చంపుకొని బ్రతకడం వేరు. మనసే లేకుండా బ్రతకడం వేరు అనే జీవిత పాఠం అతడి అనుభవాలలోంచి వచ్చినదే అని "పరావర్తనం" కథలో మనం గుర్తించగలుగుతాం. తండ్రి అనుబంధాలను, జ్ఞాపకాలను నిలుపుకున్న ఆ ఇంటిని కూలగొట్టి డెవలప్మెంట్ కు ఇవ్వాలనుకునే కొడుకు ,కోడలుకు మధ్య ఘర్షణ. తండ్రిని ఎప్పుడూ తిట్టుకుంటూ సతాయించే వారికి, ఆయన చనిపోయిన తర్వాతే ఆయన గొప్పదనం తెలిసి వస్తుంది. చివరకు ఆయన కోరిక మేరకే ఆ ఇంటికి పాత గోవా రుచులను తెలియజేసే రెస్టారెంట్ గా తీర్చి దిద్దడం "బాల్కావ్ "కథలో కనిపిస్తుంది.. గోండులు పెద్ద పండుగగా జరుపుకునే దండారికి, బస్తర్ లో ఉన్న చెల్లి బావలను ఎలాగైనా తీసుకురమ్మని తండ్రి చెప్పడంతో ధర్ము బయలుదేరుతాడు. అది కల్లోలిత ప్రాంతమని ,అడవిలో ఉన్న మావోయిస్టులను వెలికి తీయాలంటే గిరిజనులనే పావుగా వాడుకొని సల్వాజుడుం పేరుతో వాళ్లమీదికి ప్రభుత్వమే ఉసిగొల్పుతోందని తెలియని ధర్ము, వాళ్ళిద్దరి మధ్య నలిగి అక్కా బావలతో దుర్మరణం చెందడం 'అతీ' కథలో చూడవచ్చు. ఢిల్లీ సుల్తాన్ ఆజ్ఞ మేరకు కాకతీయుల వైభవం, రహస్యాల గురించి తెలుసుకోవడానికి ఓరుగల్లు వచ్చిన అజ్మత్ ఖాన్ మంచి సంగీత కారుడు. అరబిక్, పర్షియా, హిందుస్తానీ సంగీతాలలో ప్రావీణ్యుడైన అజ్మత్ ఖాన్ "తరానా" అనే సరికొత్త రాగాన్ని కనుగొంటాడు. ఈ తరానా శైలికి అనుగుణంగా ఓరుగల్లు రాజనర్తకి మాచల దేవి అద్భుతంగా నాట్యం చేయడంతో సంబరపడిపోయి ,తను సృష్టించిన కొత్త రాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అందరికీ చాటి చెబుతాడు .

పెళ్లి ద్వారా అయినా, స్నేహం ద్వారా అయినా ఒక తోడు ఉండాలని కోరుకునే దర్పణ ,స్నేహితుడితో కలిసి నిజాముద్దీన్ దర్గాకు పోయి "ముడుపు" కడుతుంది. ఆమె స్నేహం ,పెళ్లిగా మారుతుందేమో చూడాలి. తన కష్టం గుర్తించని భర్త ,కొడుకుల వేధింపులు భరించలేక తోడు కోసం ఒక అనాధ బాలుని చేరదీసిన షహీన్ అనే బ్యూటీషియన్ పడే గృహహింసను "బర్కత్ "కథలో చూడవచ్చు. ఒక ప్రాంతంలో ఉండే ఆడవాళ్ళ మధ్య స్నేహం, కలివిడి కోసం "కిట్టి పార్టీ" లను ఏర్పాట్లు చేసుకుంటారు. ఇవి కొంతమందికి తమ డాబు దర్పం ప్రదర్శించుకోవడానికి ఉపయోగపడతాయి. మరికొంతమంది తమ అవసరాలు, ప్రయోజనాలకు వీటిని వేదికలుగా చేసుకుంటారు. కిట్టి పార్టీల హంగామా హడావుడిని, ఆర్భాటాన్ని, వృధావ్యయాన్ని ఈ కథలో చూపించిన విధానం బాగుంది. వేశ్య వృత్తిలో ఉన్న కుటుంబంలో నుండి నేర్పుగా తెలివిగా బయటపడిన చిన్న కూతురు గీసిన సాహసమే "ఇంకా రాత్రి చీకట్లో". భార్యాభర్తల్లో ఒకరే కష్టపడితే అది బంధం కాదు ,స్వార్థం. బిజినెస్ పేరుతో ఇంటిని, ఇంట్లో వాళ్ళని పట్టించుకోని భర్త. ఉద్యోగరీత్యా అమెరికాలో ఉన్న భార్య . మరి పిల్లాడు ఒంటరిగా అమ్మమ్మ దగ్గరే ఉండి బెంగ పెట్టుకుంటే ఎలా ? అమెరికాలో ఆడవారికున్న స్వేచ్ఛను గమనించిన ఆమె తీసుకున్న నిర్ణయమే "కాసిన్ని పూలు". ఇవి ట్రావెలాగ్ లాంటి కథలు. కథల్లాంటి ట్రావెలాగ్ లు. ప్రతి కథ విభిన్నమైన స్థల కాలాల నేపథ్యంలో నడపడం విశేషం హైదరాబాద్ పాతబస్తీ ,విజయవాడ, గోవా ,అదిలాబాద్, వరంగల్ , బందర్ సింద్రీ ,వర్జీనియాల నేపథ్యంలో ఈ కథలను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంటుంది. వైవిధ్యభరితమైన కథా కథనాలతో ఆసక్తికరమైన ఈ కథలను చదవడం మంచి అనుభూతిని మిగిలిస్తుంది .



కె.పి అశోక్ కుమార్

**("బల్కావ్"( బ్యాక్ ప్యాక్ కథలు)
శ్రీ ఊహ. అర్క పబ్లికేషన్స్., హైదరాబాద్. వెల 175 రూపాయలు. పేజీలు 148 .ప్రతులకు: అన్ని ముఖ్య పుస్తక కేంద్రాలు)**

ROBOTICS TECHNOLOGIES
WWW.ROBOTICSTECHNO.COM

WWW.ROBOTICSTECHNO.COM

# URGENT JOB OPENINGS FOR HUMAN RESOURCES (HR) SPECIALISTS

**FREE FULLY AIR-CONDITIONED (AC) WOMEN'S HOSTEL**

SALARY : **RS. 14,000/- PER MONTH**
VERY LIMITED HOSTEL VACANCIES

QUALIFICATION : **BACHELORS**

EXPERIENCE : **FRESHERS**

- FREE HOSTEL ACCOMMODATION NEARBY OFFICE
- FREE FULLY AIR-CONDITIONED (AC) WOMEN'S HOSTEL
- SALARY HIKE: AFTER COMPLETING 6 MONTHS
- HR SPECIAL INCENTIVES & BONUSES
- FREE WI-FI, TV & QUALITY FOOD IN THE HOSTEL
- WORKING DAYS: MONDAY TO FRIDAY (US TIMINGS) ONSITE
- WEEK-OFFS: SATURDAY & SUNDAY
- JOB LOCATION: BANJARA HILLS, HYDERABAD
- EXCELLENT ENGLISH COMMUNICATION REQUIRED



**INDIA BRANCH**
43/A/1, RD NO. 12, UNION BANK ATM LANE MLA COLONY, BANJARA HILLS HYDERABAD-34

**TEXAS BRANCH**
423 W WHEATLAND RD, SUITE 103A, DUNCANVILLE
TEXAS 75116-4605. UNITED STATES

**VERMONT BRANCH**
69 ALLEN ST RUTLAND
VERMONT 05701, UNITED STATES

**OKLAHOMA BRANCH**
322 N 3RD AVE,
DURANT, OKLAHOMA 74701,
UNITED STATES

**NEBRASKA BRANCH**
639 5 LOCUST ST,
GRAND ISLAND
NEBRASKA 68801,
UNITED STATES

**INTERVIEWS TIMINGS**
**11 AM TO 1 PM**

HR RECRUITER PHONE
**95159 79925**

OFFICE PHONE:
**99085 31646, 80196 01108**

## INTERVIEWS ADDRESS
43/A/1, RD NO. 12 UNION BANK ATM LANE, MLA COLONY BANJARA HILLS, HYDERABAD - 34

# కంది క్యాంపులో మంత్రి సీతక్క

## ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



**ఆదిలాబాద్ మహా :** ఉమ్మడి కరీంనగర్ మెదక్ ఆదిలాబాద్ నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రచార సభ నిమిత్తం ఆదిలాబాద్ కు విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఘన స్వాగతం లభించింది. స్థానిక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజా సేవా భవన్ వద్ద ఆమెతో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జులకు పార్టీ శ్రేణులతో కలిసి



కంది శ్రీనివాస రెడ్డి దంపతులు శాలువాలు కప్పి పూలకుండీలు అందజేసి స్వాగతం పలికారు.

# కులగణన సర్వేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి

**వరంగల్, మహా:** తెలంగాణలో తొలిసారి చేపట్టిన కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) లో ఎవరైతే వివిధ కారణాలచే నమోదు చేసుకో లేదో అటువంటి వారి కోసం మరోసారి నిర్వహిస్తున్న సర్వే ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం, కరీమాబాద్ మీ సేవా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి ఆయా కేంద్రాల్లో రిసర్వే లో నమోదు వివరాల తీరును, రిజిస్టర్ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి ఫిబ్రవరి 28 వరకు సర్వేను నిర్వహిస్తారని, ఇప్పటి వరకు కుల గణనలో నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే సర్వేలో నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం తిరిగి అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవడానికి



వరంగల్ నగర వ్యాప్తంగా 3 ప్రజా పాలన సేవా కేంద్రాలైన పోచమ్మ మైదాన్ ఈ సేవా కేంద్రం, కాశీ బుగ్గ సర్కిల్ ఆఫీస్ కేంద్రం, కరీమాబాద్ ఈ సేవా కేంద్రం లలో, నర్సంపేట తహసిల్ కార్యాలయంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిడబ్ల్యూఎంసీ వరంగల్ పరిధి లోని అన్ని వార్డులలో, నర్సంపేట మునిసిపల్ వార్డుల్లో స్వచ్ఛ ఆటోల, టామ్ టామ్ ల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ఆయా వార్డులలో ఇంకను కుల గణనలో వివరాలు నమోదు చేసుకొని వారిని ప్రోత్సహించాలని సంధ్యారాణి అధికారులకు సూచించారు. లేదా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నెంబర్ 040 211111111 కి ఫోన్ చేసి కూడా నమోదు చేయవచ్చని, ప్రజాపాలన సేవా కేంద్రాలలో, అలాగే ఆన్లైన్ లో ఫారం ని డౌన్లోడ్ చేసుకొని దానిని సంబంధిత ప్రజాపాలన కేంద్రాలలో ఇచ్చి ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. లేదా ఆన్లైన్ సర్వే ఫారం ద్వారా **https://seeepcsurvey.cgg.gov.in** సైట్ లో నింపి మరియు సంతకం చేసి దగ్గర లో ఉన్న ప్రజా పాలన సేవా కేంద్రాలలో ఇవ్వవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సర్వేకు సహకరించాలని, పూర్తి వివరాలను ఇవ్వాలని ఆదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, బల్దియా రెవిన్యూ అధికారి షాజాదిబేగం, పర్యవేక్షకులు హాబీబుద్దిన్, ఆర్ ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

# కులగణన నమోదుకు మరో అవకాశం



**ఉప్పల్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన"ఇంటింటి కుల గణన"కార్యక్రమంలో వివిధ వివిధ కారణాల వల్ల సర్వేలో పాల్గొనని కుటుంబాల వారికోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు మరొకసారి అవకాశం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మీడియాతో మాట్లాడుతూ కులగణన సర్వేలో పాల్గొనని వారు ఫిబ్రవరి 28 వ తారీకు వరకు తమ వివరాలను 3 విధాలుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1) టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 ద్వారా కులగణలో పాల్గొనడం. 2) ఆన్లైన్ మాధ్యమం ద్వారా https://seeepcsurvey.cgg.gov.in తమ వివరాలు స్వయంగా నమోదు చేసుకుని అట్టిప్రతిని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9. 00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలి.

# బర్డ్ ఫ్లూ కలకలంతో చికెన్ సెంటర్లు వెలవెల

## చేపల మార్కెట్ లు కళకళ




**హుజూర్‌నగర్, మహా:** బర్డ్ ఫ్లూ కలకలంతో హుజూర్ నియోజక వ్యాప్తంగా చికెన్ సెంటర్లు వెలవెల పోతున్నాయి. చేపల మార్కెట్ లు కళకళ లాడుతున్నాయి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బర్డ్ ఫ్లూ వ్యాధి భయం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతుంది. ఈ దెబ్బతో ప్రతి ఒక్కరు చికెన్, కోడిగుడ్లు తినడం మానేస్తున్నారు. మార్కెట్లో కూడా కేజీ చికెన్ ధర 100 రూపాయలకు పడిపోయింది. కోడిగుడ్ల ధరలు కూడా భారీగా పడిపోతున్నాయి.చికెన్ సెంటర్ లవద్ద ఒక్కరూ ఇద్దరు మాత్రమే కనిపిస్తుండగా చేపల మార్కెట్ వద్ద మాత్రం గుంపులు గుంపులుగా జనాలు ఉండడం విశేషం. ఆదివారం వచ్చిందంటే ఇక చేపల రెటు చెప్పనవసరం లేదు అమాంతం పెరిగి పోతుంది గతంలో నాటు కోళ్లు మాత్రమే గ్రామాల్లో ఉండేవి. పౌల్ట్రీ పరిశ్రమ డెవలప్ అయిన తర్వాత చికెన్ తినే వారి సంఖ్య పెద్ద ఎత్తున పెరిగింది. ప్రతి ఫంక్షన్ కి చికెన్ ఎక్కువగా వడ్డిస్తూ ఉంటారు. అయితే ఈ



పౌల్ట్రీ పరిశ్రమలో పెంచే కోళ్ళకు వ్యాక్సిన్ వేసి స్టెరాయిడ్స్ ఇచ్చి పెంచుతుంటారు. వీటికి బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని.. ముఖ్యమైన విషయం ఏమిటంటే చికెన్ లివర్ ఎక్కువగా తిన కూడదని వేసవిలో ఈ బర్డ్ ఫ్లూ ఎక్కువగా సోకుతుందని ముఖ్యంగా తెలంగాణలో ఇప్పటివరకు బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాకపోయినప్పటికీ, సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహా రాష్ట్ర లో బర్డ్ ఫ్లూ కేసులు పెద్ద ఎత్తున ఉన్నాయి.దీంతో తెలంగాణలోకి ఇతర రాష్ట్రాల నుంచి కోడిగుడ్లు చికెన్ రాకుండా జాగ్రత్త పడుతున్నారు.




# సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించండి

## బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాఖడే

**హనుమకొండ, మహా:** పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని బల్దియా బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాఖడే అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్ లో గల మెడికోవర్ యాజమాన్యం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను రూ.7 లక్షల 23 వేల 289 చెక్ ను ఆదివారం ఖాజిపేట సర్కిల్ కార్యాలయంలో కమిషనర్ కు అందజేశారు. ఈ సందర్భం గా కమిషనర్ బల్దియా వ్యాప్తం గా విద్యాసంస్థలు, హాస్పిటల్ లు వ్యాపార, వాణిజ్య సంస్థలు,గృహాలు ఆస్తి పన్నులు విధి గా సకాలంలో చెల్లించి నగర ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెవెన్యూ అధికారి యూసుఫోద్దిన్ సూపరిండెంట్ అనిల్ ఆర్ ఐ లు దేవరాజ్ రజని బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలి

## తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్, వరంగల్

**వరంగల్, మహా:** కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందిన సమయంలో జర్నలిస్టులకు రద్దు చేసిన రైల్వే రాయితీ పాసులను వెంటనే పునరుద్ధరించాలని TSJU (తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ యూనియన్ సభ్యులతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కోరారు. ఆదివారం నల్గొండ, ఖమ్మం, వరంగల్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరానికి వచ్చిన కిషన్ రెడ్డిని TSJU నాయకుల. ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ రైల్వే శాఖ రాయితీ పాసులను పునః ప్రారంభించాలని వినతి పత్రంలో కోరారు. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందిన సమయంలో రైల్వే మంత్రిత్వ శాఖ జర్నలిస్టులకు రాయితీ పాసులను రద్దు చేసినప్పటి నుంచి ఎక్రిడేటెడ్ జర్నలిస్టులందరూ వార్తలు, కథనాలు, తదితర ప్రెస్ సంబంధిత పనుల కోసం సొంత ఖర్చులతో ప్రయాణాలు చేస్తున్నారని స్పష్టం చేశారు. అంతేకాకుండా రైలులో ప్రయాణం చేసేటప్పుడు అదనపు మద్దతు అవసరమయ్యే కొన్ని వర్గాల ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచవలసిన అవసరం ఉందని ఆ లేఖలో మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేసే జర్నలిస్టులకు తక్షణమే రైల్వే శాఖ రాతిపాసులను నా ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సాధించాలని



కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో TSJU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు బత్తుల సత్యం, కందికొండ గంగరాజు, నీరుటి శ్రీహరి, మంచోజు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి సీతక్క

- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ప్రచార సభకు ముఖ్య అతిథిగా హాజరు
- నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్లకు విజ్ఞప్తి




**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి , స్త్రీశిశు సంక్షేమం ఉమ్మడి జిల్లా మంత్రి సీతక్క అన్నారు.ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన కరీంనగర్ మెదక్‌ఆదిలాబాద్‌నిజామాబాద్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి ప్రచార సభ లో ఆమె పాల్గొని ప్రసంగించారు.పెద్ద సంఖ్యలో హాజరైన పట్టభద్రులు కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ దేవుడు వేరు రాజకీయం వేరన్నారు. బీజేపీ దేవుడిపై కులమతాల మీద రాజకీయం చేస్తుందన్నారు. మోదీ బీసీ కాదన్న సీయం రేవంత్ వ్యాఖ్యలకు కొందరు బీజేపీనాయకులు రాహుల్ గాంధీ కులమేంటని అడుగుతున్నారన్నారు.. దేశ కోసం సర్వం త్యాగం చేసిన మోతీలాల్ నెహ్రూ కుటుంబం నుండి వచ్చిన నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. కాబట్టి రాహుల్ గాంధీ కులం త్యాగమన్నారు. మంచితనం ఆయన మతమన్నారు. 11 సంవత్సరాలు అధికాకరంలో ఉండి ఏం చేసారో చెప్పాలని ప్రశ్నించారు.ఇక్కడ ఎంపీ గెలిచినా ఎమ్మెల్యే గెలిచినా ఆదిలాబాద్ కోసం ఏం తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు. కులగణన గొప్ప చరిత్ర అన్నారు. అలాంటి మంచి కార్యక్రమానికి సహకరించకండ తప్పుబట్టడం సరికాదన్నారు. రుణమాఫీ జరిగిందని రైతు భరోసా పడుతుందన్నారు. ఫ్రీ బస్ నడుస్తుందని 500 లకే గ్యాస్ ఇస్తున్నామని ఇన్ని మంచి పనులు చేస్తున్నద కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మీరు అక్షింతలు తేవడం తప్ప చేసిందేమీ లేదన్నారు.నరేందర్ రెడ్డిని గెలిపిస్తే ఇంచార్జి మంత్రిగా తనకు బూస్టు నిస్తుందన్నారు. కాబట్టి పట్టభద్రులంతా వూట్కూరి నరేందర్ రెడ్డి కి తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు. ఆదిలాబాద్ అభివృద్ధి కోసం పాటు పడతాడని కావున రెండవ సీరియల్ నంబర్ నరేందర్ రెడ్డి కే తొలి ప్రాధాన్యాతా ఓటు వేయాలని కోరారు.గీత గీసి రాత మార్చాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేను ఇప్పటికే ఇక్కడికి ఒక సారి వచ్చి కొన్ని సామాజిక సేవలు చేసినట్టు వివరించారు.లైబ్రరీలో కాంపెటీటివ్ ఎగ్జామ్ కు ప్రిపేరయ్యే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం అందించే విధంగా సీయం తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.ఇక్కడ ఒక యూనివర్సిటి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.కాంగ్రెస్ పార్టీ ఉద్యోగాలిచ్చింది ఆపార్టీ పట్ల కృతజ్ఞతతో ఓటు వేస్తామని మాట ఇచ్చారని అన్నారు. తనను గెలిపిస్తే మీలో ఒకడిగా ఉంటానని తెలిపారు. ఈనెల 22 న జరిగే ఎన్నికలలో రెండవ సీరియల్ నెంబర్ లో ఉన్న వూట్కూరి నరేందర్ రెడ్డి అనే పేరు ప్రక్కన తమ మొదటి ప్రాధాన్యత సంఖ్యను వేయాలని మనవి చేసారు.ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలన్నీ తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ పది రోజులు చాలా ముఖ్యమని అంతా కలసి కాంగ్రెస్ పార్టీ ని గెలిపించాలని కోరారు.ఈ గెలుపు మనకు ఎంతో ముఖ్యమన్నారు.ప్రతీ గ్రాడ్యుయేట్ ఇంటికి వెళ్లి కలిసి ఓటు అడగాలని తన టీమ్ తో పాటు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.సభకు అధ్యక్షత వహించిన ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అంతా కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు.పట్టభద్రుల సంక్షేమం కోసం పాటు పడే నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్ లను కోరారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని కోరారు. వాట్సాప్ లు ఫోన్ లో కాకుండా శ్రేణులంతా ఆయా మండలాలోని గ్రామాల పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి నరేందర్ రెడ్డికి ఓటు వేయాలని కోరాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గా మనది సిట్టింగ్ స్థానమని తిరిగి మళ్లీ గెలిపించుకోవాలని ఆయన సూచించారు. పట్టభద్రులంతా తప్పకుండా నరేందర్ రెడ్డి కే తమ మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు.ఈ కార్య క్రమంలో మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్,జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు భూపెల్లి శ్రీధర్, ఆత్రం సుగుణ ,పార్లమెంట్ కో.ఆర్డినేటర్ నరేష్ జాదవ్,మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమాండ్ అలీ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి,డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ జిల్లా అధ్యక్షులు సెడ్మాకి ఆనంద్ రావు,మాజీ జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి,రాందాస్ నాక్లే,పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,కౌన్సిలర్లు బండారి సతీష్,కలాల శ్రీనివాస్,ఆవుల వెంకన్న,యెల్మెల్వార్ రామ్ కుమార్,జాఫర్ అహ్మద్,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే,సిపిఐ జిల్లా అధ్యక్షులు ముడుపు ప్రభాకర్ రెడ్డి, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,మొహమ్మద్ రఫీక్, సుధాకర్ గౌడ్, బండి దేవిదాస్ చారి,కొండూరి రవి,షేక్ మన్సూర్,సయ్యద్ షౌకత్ అలీ,అఫ్రోజ్ అహ్మద్, ఓసావర్ సురేష్, దినేష్ గౌడ్, మహాకాల్ అజయ్, రాజా లింగన్న,ఓరగంటి అఖిల్,అయాస్ తదితరులు పాల్గొన్నారు.

# హలో ఆర్ఎంపి చలో హైదరాబాద్ బహిరంగ సభను జయప్రదం చేయండి

## ఆర్ఎంపీల సంఘం డివిజన్ అధ్యక్షులు షేక్ మన్సూర్ అలీ



**హుజూర్ నగర్, మహా:** హలో ఆర్ఎంపి చలో హైదరాబాద్ పోస్టర్లను ఆర్ఎంపిల సంఘ డివిజన్ అధ్యక్షులు షేక్ మన్సూర్ అలీ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. హుజూర్ నగర్ డివిజన్ రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంఘ ముఖ్యుల సమావేశంలో షేక్ మన్సూర్ అలీ మాట్లాడుతూ తేదీ 18022025 మంగళవారం నాడు హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 గంటలకు తెలంగాణ ఆర్ఎంపి పిఎంపి సంఘాల ఉమ్మడి ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ బహిరంగ సభకు హుజూర్నగర్ నియోజకవర్గం లోని ఏడు మండలాల పరిధిలోని ఆర్ఎంపి, పిఎంపి గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆర్ఎంపి, పిఎంపి గ్రామీణ వైద్యులకు ప్రభుత్వ గుర్తింపు ను ఇవ్వాలని దశాబ్దాలుగా అనుభ వైద్యుల సంఘాల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి గుర్తింపు ను సాధించుకొనుటకు ఐకమత్యమే మహా బలమని అన్నారు. దివంగత నేత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మొట్టమొదటిసారిగా ఆర్ఎంపి పిఎంపి గ్రామీణ వైద్యుల సేవలను ప్రభుత్వపరంగా గుర్తించి జీవో నెంబర్ 429 ప్రకారం 14 మందితో కమిటీని ఏర్పాటు చేసి కమ్యూనిటీ పారామెడిక్స్ గా శిక్షణ ఇచ్చి గుర్తింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని 2009 సంవత్సరంలోనే 1273 జీవో విడుదల చేసిన అనంతరం 13,000 మంది ఆర్ఎంపీలు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్స్ లలో ప్రభుత్వ పరంగా శిక్షణ పొంది ఉన్నారని మిగిలిన వారు శిక్షణ కొరకు నేటి వరకు ప్రభుత్వ ఉత్తర్వుల కొరకు ఎదురుచూస్తున్నారని అన్నారు. 2023 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో 2009 జీవో ప్రకారం ఆరు నెలలు ప్రభుత్వ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ఆర్ఎంపి పిఎంపి గ్రామీణ వైద్యులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు కృషిచేసిన విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మర్చిపోవద్దని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం లో ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నమోదు చేస్తున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆర్ఎంపీలపై దాడులను నిలిపివేయాలని అన్నారు. అనంతరం హలో ఆర్ఎంపి చలో హైదరాబాద్ పోస్టర్లను పాంప్లెట్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ బాబు, చింతలపాలెం మఠంపల్లి మండలాల ఆర్.ఎం.పి సంఘం అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వర్లు షేక్ శంషుద్దీన్ హుజూర్ నగర్ నేరేడుచర్ల పాలకవీడు మండలాల ఆర్ఎంపి సంఘం ప్రధాన కార్యదర్శులు సన్నిధి వెంకటేశ్వర్లు, కే లింగయ్య, కే జానయ్య, బి రామారావు బ్రహ్మం, షేక్ మీరా, పూల రాజు ఏడుకొండలు , అమీనా, హనుమంతు, గురవయ్య ,నాగేశ్వర రావు , శ్రీనివాస్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో

# గజస్తంభం ప్రతిష్ట



**ఉప్పల్,మహా:** మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్యటనలో భాగంగా శ్రీ మహా లక్ష్మి నగర్ కాలనీలో శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో గజస్తంభం ప్రతిష్ట కార్యక్రమం లో చామకూర మల్లారెడ్డి మాజీ మంత్రి మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు పాల్గొన్నారు,అలాగే ద్వారకా నగర్ లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. మరియు రాంరెడ్డి నగర్ లోని శ్రీ కృష్ణ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమలలో భాగంగా జరిగిన స్వామి వారి కళ్యానోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

# సర్వేలో పాల్గొనని వారు సమాచారమివ్వండి

**వరంగల్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వే లో ఇప్పటివరకు నమోదు చేసుకొని వారు ప్రజా పాలన కేంద్రాల్లో సమాచారం అందజేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాల వల్ల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే హౌస్‌లిస్ట్‌లో ఉండి సర్వే చేయని కుటుంబాలకు ఫిబ్రవరి 16 నుంచి 28 ఫిబ్రవరి వరకు మరో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్ 04021111111 కు ఈ నెంబర్ కు ఉ.9 నుండి సా.5 గం. ల మధ్య కాల్ చేసి సమాచారం అందజేయవచ్చునని, లేదా ఆన్‌లైన్ ఫారమ్ డౌన్‌లోడ్: సర్వే ఫారమ్‌ను https://seeepcsurvey. cgg.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోని, నింపి సంతకం చేసిన తర్వాత, దానిని సమీపంలోని ప్రజా పలాన సేవా కేంద్రంలో సమర్పించవచ్చని, లేదా జీ డబ్ల్యూ ఎం సి కి సంబంధించి ఖాజీపేట సర్కిల్ పరిధి లో ఐదు ప్రజా పాలన సేవా కేంద్రాలలో సమాచారం అందజేయాలని అన్నారు.

# సల్లంగ... చూడు తల్లీ

## మేడారంలో కొనసాగుతున్న భక్తుల సందడి

**తాడ్వాయి, మహా :** మేడారం మినీజాతర ముగిసనప్పటికీ అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో మేడారంకు తరలివచ్చారు. సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాలనుండి అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లులను దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగుకు చేరుకున్న భక్తులు వాగువద్ద ఏర్పాటు చేసిన నల్లాల వద్ద స్నానాలు చేసి తలనీలాలు సమర్పించుకున్న అనంతరం గద్దెలవద్దకు చేరుకొని తల్లులను దర్శించుకున్నారు. గిరిజన సాంప్రదాయం ప్రకారం పూజారులు భక్తులకు అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఆదివారం రోజున సుమారు లక్ష మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సమ్మక్క సారలమ్మ నామస్మరణ చేస్తూ ఎత్తు బంగారంతో క్యూలైన్ల ద్వారా పసుపు కుంకుమ



లతో అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజులుగా జాతరకు వచ్చి ఇక్కడే ఉంటున్న భక్తులు కూడా ఈ రోజు పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనాలకు పంపించారు. మేడారంలో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని అధికారులను స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచాలి




**ఉప్పల్, మహా:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 313వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహం జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా భారతదేశంలోని అన్ని కులాలకు విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు అమలు కావాలంటే మారుతున్న కాలంతో పాటు ఆయా కులాల జనాభాలో కూడా మార్పులు జరిగాయని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా కుల గణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి వాటిని పకడ్బందీగా అమలు చేయాలని అప్పుడే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని నత్తి మైసయ్య అన్నారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయడానికి సానుకూలంగా ఉండడం రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సర్వే నిర్వహించడం అభినందనీయమని రాజ్యాంగ ప్రకారం జనాభా ప్రతిపరికణ రిజర్వేషన్లు కల్పించినప్పుడే వెనుకబడిన కులాలు రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, గరుగుల యాకయ్య,రొయ్య లక్ష్మీనారాయణ, మైసగుల్లా జానీ కుమార్ యేసు రాజు,సగ్గు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

07

సోమవారం, హైదరాబాద్ | 17-02-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM


# ప్రైవేట్‌కు స్వాగతం

## ప్రభుత్వ సంస్థలకు వీడ్కోలు

### పక్కరాష్ట్రాలకు ప్రభుత్వ రంగం

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలో ప్రభుత్వ విధానమిది

ఇతర రాష్ట్రాల్లో జెన్‌కో, సింగరేణి పెట్టుబడులు..

తెలంగాణలో ప్రైవేట్ సంస్థల పెట్టుబడులకు ఎంవోయూ

విద్యుత్తు విషయంలో తిరోగమన దిశలో సర్కారు



**హైదరాబాద్** : ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది. మన రాష్ట్రంలో కొత్త విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి ద్వారా ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. మన దగ్గర ప్రైవేట్ ప్లాంట్లకు గేట్లు తెరిచి, మన విద్యుత్తు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్నది. ప్రభుత్వ తీరును విద్యుత్తురంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నిస్తున్నారు.

**జెన్‌కో, సింగరేణితో ఇతర రాష్ట్రాల్లో పనులు**

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ విషయంలో జెన్‌కో, సింగరేణి సంస్థలు ఆరితేరాయి. జెన్‌కో థర్మల్, హైడల్ విద్యుత్తు ప్లాంట్లు నిర్మించగా.. సింగరేణి థర్మల్, సోలార్ ప్లాంట్లను నిర్మించడంతోపాటు రామగుండంలో కొత్తగా పంప్‌స్టోరేజీ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు సంస్థలను కాదని ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. ఆ రెండు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు పెట్టిస్తున్నది. ప్రభుత్వ సంస్థలతో సొంత రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టించడం ఎందుకో.. దీని వెనుకున్న మతలబేమిటోనని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాల్లో మనంపెట్టేవి..**

టీజీ జెన్‌కో హిమాచల్‌ప్రదేశ్‌లో బిల్డ్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్‌పర్ (బీవోటీ) పద్ధతి లో జలవిద్యుత్తు కేంద్రం (హైడల్) నిర్మాణనికి సంప్రదింపులు జరుపుతున్నది. సింగరేణి సంస్థ రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్తు పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంది. 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పనుంది. సింగరేణి సంస్థ ఒడిశాలోని నైనీలో 1, 600 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

**మన రాష్ట్రంలోకి ప్రైవేట్ పెట్టుబడులు**

సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రూ.45 వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నది. ఈ సంస్థ నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ 3,400 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ 11వేల కోట్ల పెట్టుబడులతో 2,160 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్లను నెలకొల్పనుంది.

### హడావిడిగా పాలసీ.. అందుకేనా

క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించింది. ఈ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. అయితే దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రప్రభుత్వం విద్యుత్తు రంగంలో 66 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నది. దావోస్ సదస్సుకు ముందే సర్కారు గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది. తాజాగా వచ్చిన పెట్టుబడులన్నీ గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించినవే. అంటే దావోస్ సదస్సుకు ముందే పాలసీ రూపొందించడం వెనుక ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించాలన్న ముందస్తు కుట్ర దాగి ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. హడావిడిగా పాలసీ రూపకల్పన వెనుక ఇదే కోణం దాగి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ మరో 3వేల కోట్లను రాష్ట్రంలో పెట్టుబడి
పెట్టి, వెయ్యి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

మైత్రా ఎనర్జీ సంస్థ 7వేల కోట్లు పెట్టేందు కు ముందుకొచ్చింది. ఈ సంస్థ 2,400 మెగావాట్ల సోలార్ సెల్, మరో 2,400మెగావాట్ల సోలార్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది.




## రుణగ్రహీతలకు ఎస్బీఐ శుభవార్త..

### ఈబీఎల్ఆర్, ఆర్ఎల్ఎల్ఆర్ రుణాలపై వడ్డీరేటు తగ్గింపు

**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్‌బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలతోపాటు ఇతర రుణాలపై చెల్లించే ఈఎంఐలు తగ్గనున్నాయి. ఈ నూతన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. రిజర్వ్‌బ్యాంక్ ఇటీవల రెపోరేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎస్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఈబీఎల్ఆర్ రేటు పావు శాతం తగ్గించడంతో రేటు 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగొచ్చింది. అలాగే ఆర్ఎల్ఎల్ఆర్ కూడా 8.50 శాతానికి దించింది. ఆర్బీఐ విధించిన రెపోరేటు ఆధారంగా బ్యాంకులు దీనికి అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను నిర్ణయిస్తుంటాయి. సెంట్రల్ బ్యాంక్ గతవారంలో రెపోరేటును తగ్గించడంతో బ్యాంకులు ఒక్కొక్కటి రుణాలపై వడ్డీరేటును తగ్గిస్తున్నాయి. ఎస్బీఐ కూడా ఈ నిర్ణయం తీసుకున్నది. కానీ, మార్జినల్ కాస్ట్‌బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్), బేస్‌రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు(బీపీఎల్ఆర్)ని యథాతథంగా ఉంచింది బ్యాంక్.

**ఎస్బీఐకి రూ.30 కోట్లు**

తెలంగాణకు చెందిన రిఫైనరీ కంపెనీ శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్, మరికొన్ని సంస్థల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.30 కోట్లకుపైగా విలువైన ఆస్తులను రికవరీ చేసి ఎస్బీఐకి అప్పగించింది.

### మరిన్ని బ్యాంకులు కూడా..

ఎస్బీఐ బాటలోనే మరిన్ని బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. వీటిలో కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు ఉన్నాయి. దీంట్లో కెనరా బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం నుంచి 9 శాతానికి దించింది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా బీఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 8.90 శాతానికి దించింది. ఈ వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయి. అలాగే ఈ నెల 7 నుంచి అమలులోకి వచ్చేలా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎల్ఎల్ఆర్ రేటుని 9.35 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా 9.10 శాతానికి తగ్గించగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రెపోతో అనుసంధానమై రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం 9 శాతానికి తగ్గించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సైతం ఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 9 శాతానికి కోత పెట్టింది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# ఏఐతో జ్ఞాన హీనులవుతున్నామా?

### దానిపై ఎక్కువ నమ్మకముంటే మెదడుకు తక్కువ పనే

స్వీయ సామర్థ్యాన్ని నమ్మితే క్రిటికల్ థింకింగ్ చేస్తాం

కృత్రిమ మేధపై అధ్యయనంలో ఆసక్తికర అంశాలు




**సిడ్నీ:** కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం మానవుడి ఆలోచనా శక్తిపై ఎలా పడుతున్నదనే అంశంపై తాజా అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వారానికి దాదాపు 30 కోట్ల మంది చాట్‌జీపీటీని వాడుతున్నట్లు అంచనా. చాలా వరకు మనం మెదడుతోనే ఆలోచించగలం. అయితే, చిన్న చిన్న లెక్కలు చేయడానికి, దుకాణాల్లో సరుకులు కొనడానికి పరికరాలపై ఆధారపడుతుండటం వల్ల మనం మన జీవితాలను సౌకర్యవంతంగా మార్చుకుంటున్నామా? లేక మనం వివేకహీనులుగా మారుతున్నామా? అనే ప్రశ్నకు అమెరికాలోని మైక్రోసాఫ్ట్, కార్నెగీ మెలన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు 'అవును' అనే సమాధానం ఇవ్వవచ్చు అంటున్నారు! ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ వంటి జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన సమయంలో ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనదని పరిశోధకులు చెప్తున్నారు. చదివిన, విన్న, చెప్పిన, రాసిన విషయాన్ని గురించి ప్రశ్నించుకుని, విశ్లేషించుకుని, అర్థం చేసుకుని, మదింపు చేసుకుని, సరైన నిర్ణయం తీసుకోవడాన్ని క్రిటికల్ థింకింగ్ (విశ్లేషణాత్మక ఆలోచన) అంటారు. యూజర్లు తమ క్రిటికల్ థింకింగ్‌పై జనరేటివ్ ఏఐ ప్రభావం గురించి ఎలా భావిస్తున్నారనే అంశాన్ని పరిశోధకులు తమ అధ్యయనంలో మదింపు చేశారు. ప్రస్తుత పద్ధతులు, నియమాలను బట్టి మనం సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటాం. వాదనలలో పొంతన కుదరడం, కచ్చితత్వం, గట్టి సంబంధం కలిగి ఉండటం వంటి విలువలు ఈ నియమాల్లో కొన్ని. మనకు ప్రస్తుతమున్న ప్రాపంచిక దృక్పథాలు, పక్షపాతాలు, అసంపూర్ణ లేదా కచ్చితత్వం లేని మానసిక విధానాలపై ఆధారపడటం వంటివి మన ఆలోచనల నాణ్యతపై ప్రభావం చూపే మరికొన్ని అంశాలని అధ్యయనంలో తేలింది. తాజా అధ్యయనంలో 319 మంది నాలెడ్జ్ వర్కర్స్ పాల్గొన్నారు. వీరు తాము జనరేటివ్ ఏఐ సహాయంతో నిర్వహించిన 936 టాస్క్‌ల గురించి చర్చించారు. వెరిఫికేషన్, ఎడిటింగ్ దశల్లో శ్రద్ధ పెట్టడంలో కన్నా, టాస్క్ నిర్వహణలో క్రిటికల్ థింకింగ్‌ను తక్కువగా ఉపయోగిస్తున్నట్లు యూజర్లు భావించారని తేలింది. ఏఐపై ఎక్కువ నమ్మకం గలవారు క్రిటికల్ థింకింగ్‌ను తక్కువగా ప్రదర్శించారని, తమపై తమకు ఎక్కువ నమ్మకం గలవారు క్రిటికల్ థింకింగ్‌ను ఎక్కువగా ప్రదర్శించారని వెల్లడైంది. అందువల్ల జనరేటివ్ ఏఐ వ్యక్తి యొక్క క్రిటికల్ థింకింగ్‌కు చేటు చేయదని తెలుస్తున్నది. యూజర్ల క్రిటికల్ థింకింగ్‌ను ప్రోత్సహించేందుకు ఫీచర్లను పెట్టాలని జనరేటివ్ ఏఐ డెవలపర్లకు ఈ అధ్యయనకర్తలు సలహా ఇస్తున్నారు. అయితే, ఏఐని ఉపయోగించడానికి ముందు, ఉపయోగించేటపుడు ప్రతి దశలోనూ విశ్లేషణాత్మక ఆలోచన అవసరమేనని పరిశోధకులు సూచిస్తున్నారు.

## బాణసంచా కర్మాగారంలో పేలుడు.. ఇద్దరు మృతి

**ముంబై:** బాణసంచా కర్మాగారంలో పేలుడు జరిగింది. బిల్డింగ్ కూలిపోయింది. ఈ సంఘటనలో ఇద్దరు మరణించారు. పలువురు గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం కొత్వాల్‌బుడిలోని ఒక బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి అక్కడి బిల్డింగ్ కూలిపోయింది. శిథిలాల కింద కొందరు చిక్కుకున్నారు. భయాందోళన చెందిన కార్మికులు అక్కడి నుంచి బయటకు పరుగులుతీశారు. కాగా, ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.





## హోటల్ లిఫ్ట్‌లో చిక్కుకున్న కాంగ్రెస్ ఎంపీ..

### తర్వాత ఏం జరిగిందంటే?

**చెన్నై:** ఒక హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ మీటింగ్ కోసం వచ్చిన ఆ పార్టీ ఎంపీ హోటల్ లిఫ్ట్‌లో చిక్కుకున్నారు. (Congress MP Trapped Inside Hotel Lift) ఈ విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గంటపాటు శ్రమించారు. లిఫ్ట్ డోర్ బ్రేక్ చేశారు. అందులో చిక్కుకున్న ఆ ఎంపీని రక్షించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తమిళనాడులోని కడలూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం వడలూరులోని ఒక హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ ఎంపీ విష్ణు ప్రసాద్ అక్కడకు చేరుకున్నారు. కాన్ఫరెన్స్ హాల్‌కు వెళ్లేందుకు కొందరితో కలిసి హోటల్‌లోని లిఫ్ట్ ఎక్కారు.

కాగా, సాంకేతిక సమస్య వల్ల ఆ లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో కాంగ్రెస్ ఎంపీ విష్ణు ప్రసాద్‌తోపాటు మరికొందరు నేతలు అందులో చిక్కుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఫైర్ సిబ్బంది ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. లిఫ్ట్ డోర్ తెరిచేందుకు గంటపాటు శ్రమించారు. చివరకు లిఫ్ట్ డోర్ బ్రేక్ చేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీ విష్ణు ప్రసాద్‌తోపాటు ఆరేడు మంది నేతలు ఆ లిఫ్ట్ నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# ఏఐ బాయ్ ఫ్రెండ్.. మస్తుంటడు!

### చైనాలో డేటింగ్ సిమ్యులేషన్ గేమ్‌కు విపరీత ఆదరణ

**బీజింగ్ :** 'నా మెస్సేజ్‌లకు స్పందించడు.. నేను చేసే ఫోన్ కాల్స్ ఎత్తడు, నా రోజు వారీ ముచ్చట్లు ఓపిగ్గా వినడు, నన్ను బుజ్జగించడు, నన్ను అస్తమానం పొగడడు..' సాధారణంగా ప్రతి ప్రేయసి తన ప్రియుడిపై చేసే ఫిర్యాదులివి. అయితే ఈ సమస్యలన్నింటినీ భర్తీ చేసే సాంకేతికత వస్తే ఎలా ఉంటుంది? ఆ కృత్రిమ క్యారెక్టర్ నిజమని భావిస్తూ దానితో చాటింగ్‌లో యువతులు మునిగేలా నిజం చేస్తే ఎలా ఉంటుంది? అయితే ఈ ఆలోచన భారత్‌లో నిజం కాకపోవచ్చేమో కానీ, చైనాలో పూర్తిగా విజయవంతమైంది. కృత్రిమ మేధతో సృష్టించిన కృత్రిమ బాయ్ ఫ్రెండ్స్ ఇప్పుడు చైనాలో ఎంతో ప్రాచుర్యం పొందారు. దీనిని సృష్టించిన వ్యాపారవేత్త ఇప్పుడు బిలియనీర్ అయిపోయారు. ఈ వ్యాపార విజయాన్ని పరిశీలిస్తే సమాజంలో ఇలాంటి అసాధారణ భాగస్వామ్యాలు భవిష్యత్తులో మరింత అవసరమన్న విషయాన్ని చెప్పకనే చెబుతున్నది. ఫోర్బ్స్ కథనం ప్రకారం.. షాంగై కేంద్రంగాయావో రున్హా సృష్టించిన డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ లవ్ అండ్ డీప్ స్పేస్ 60 లక్షల మందిని ఆకర్షించింది. సగటు యువతి తన ప్రియుడు ఎలా ఉండాలని కోరుకుంటుందో అలాంటి ఆదర్శ ప్రియుడిని ఇందులో సృష్టించారు. పొడవుగా, అందంగా ఉండే జేన్ అనే పాత్రను సృష్టించారు. జేన్ ఫోన్ టెక్స్ సందేశాలకు త్వరగా స్పందిస్తాడు. వారి ఫోన్ కాల్‌కు వెంటనే సమాధానమిస్తాడు. వారు చెప్పే మాటలను ఓపికగా వింటాడు. అయితే అతనిలో ఉన్న ఏకైక లోపం అతనికి సిలికాన్ చిప్ లేకపోవడం. షాంగై కేంద్రంగా ఉండే పేపర్ గేమ్స్ అభివృద్ధి చేసిన ఈ గేమ్ ఏఐ, వాయిస్ రికగ్నిషన్ ఆధారంగా పని చేస్తుంది. ఈ గేమ్ ఐదు పురుష పాత్రలతో గేమ్‌లోని ఫోన్‌కాల్స్‌కు అనుగుణంగా స్పందిస్తూ వారితో సరస సల్లాపాలు సాగిస్తుంది. ఇది యువతులకు విపరీతంగా నచ్చేసింది. బాయ్‌ఫ్రెండ్ స్థానాన్ని ఇది భర్తీ చేస్తుందని వారు భావిస్తుండటంతో దీనికి విపరీత ఆదరణ పెరిగింది.





# ఓ కొత్తరకం ప్రేమకథ

నటుడిగానే కాక, గాయకుడిగా, పాటల రచయితగా, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞ కనబరుస్తున్నారు తమిళ అగ్రనటుడు ధనుష్. ఆయన దర్శకత్వంలో వచ్చిన పా పాండి, రాయన్ చిత్రాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఈ క్రమంలోనే ఆయన దర్శకత్వంలో రానున్న మూడవ సినిమా 'నిలవక్కు ఎన్ మేల్ ఎన్నాడి కోబమ్'. ఈ తమిళ సినిమా 'జాబిలమ్మ నీకు అంతకోపమా' పేరుతో తెలుగులోనూ ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటైర్టైన్మెంట్స్ ఎల్ఎల్పి సంస్థ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. జాన్వి నారంగ్ మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం ఇచ్చిన ధనుష్‌గారికి థాంక్స్. ఓ కొత్తరకం ప్రేమకథతో రానున్నాం.' అని చెప్పారు. ఇంకా ఈ సినిమాలో నటించిన అనికా సురేంద్రన్, రబియా, వెంకటేష్ మీనన్, రమ్య రంగనాథన్, పవీష్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: లియోన్ బ్రిట్టో, నిర్మాణం: వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌కె ప్రొడక్షన్స్.

# నలుగురు యువకుల మ్యూజికల్ జర్నీ


ప్రస్తుతం విజయ్‌దేవరకొండతో 'కింగ్‌డమ్' వంటి భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఇదే బ్యానర్‌లో గౌతమ్ తిన్ననూరి 'మ్యాజిక్' పేరుతో ఓ మ్యూజికల్ డ్రామాను డైరెక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సినిమా నుంచి 'డోంట్ నో వై' అనే గీతాన్ని విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాల కలబోతగా చక్కటి విజువల్స్‌తో ఈ పాట సాగింది. కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించిన ఈ గీతాన్ని అనిరుధ్, ఐశ్వర్య సురేష్ ఆలపించారు. తమ కళాశాల ఉత్సవం కోసం ఓ పాటను స్వరపరచడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుందని, వారి మ్యూజికల్ జర్నీ భావోద్వేగాల్ని పంచుతుందని చిత్ర బృందం పేర్కొంది. సారా అర్జున్, అన్మోల్ కజాని, ఆకాష్ శ్రీనివాస్, సిద్ధార్థ్ తణుకు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి



కెమెరా: గిరీష్ గంగాధరన్, ఆర్ట్: అవినాష్ కొల్లా, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, రచనదర్శకత్వం: గౌతమ్ తిన్ననూరి.

## కార్తీక్ ఆర్యన్‌తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న శ్రీలీల.. ఫస్ట్ లుక్ రిలీజ్

బాలీవుడ్ నుంచి వచ్చిన క్లాసిక్ చిత్రాలలో ఆషికి ఒకటి. ఈ ఫ్రాంచైజ్ నుంచి ఫస్ట్ పార్ట్ 1990లో రాగా సూపర్ హిట్ అందుకుంది. అనంతరం 2013లో ఆషికి 2 రాగా.. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా ఆ ఏడాది చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలో ఆదిత్య రాయ్ కపూర్, శ్రద్ధ కపూర్ జంటగా నటించారు. అయితే ఆషికి 2 వచ్చిన 12 ఏండ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు తెలుస్తుంది. టైటిల్ అనౌన్స్‌మెంట్ చేయలేదు కానీ ఈ సినిమా స్టోరీ చూస్తుంటే ఆషికి 3 అని తెలుస్తుంది. సంగీత నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. అయితే ఈ సినిమాతోనే తెలుగు భామ శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతుంది. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ అంటూ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో కార్తీక్ ఆర్యన్ సింగర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు అనురాగ్ బసు (Anurag Basu) దర్శకత్వం వహిస్తుండగా.. గుల్షన్ కుమార్ & టిసిరీస్ ప్రెజెంటేషన్, ఎ టిసిరీస్ ఫిల్మ్స్ & అనురాగ్ బసు ప్రొడక్షన్ బ్యానర్లపై భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్నారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాకు సంగీత దిగ్గజం ప్రీతమ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.



## మరో ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ మార్కో

మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ మార్కో (Marco). హనీఫ్ అదేని (Haneef Adeni) ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో కూడా విడుదల చేయగా.. మంచి వసూళ్లను రాబట్టింది. ఇదిలావుంటే ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ వేదిక 'సోనీలివ్' ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో మార్కో అందుబాటులో ఉంది. అయితే ఈ సినిమా మరో ఓటీటీలో కూడా రాబోతుంది. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహా(Marco On AHA)లో ఈ సినిమా ఈ నెల 21 నుంచి మార్కో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS



# ఐపీఎల్ 2025 షెడ్యూల్ వచ్చేసింది

## 65 రోజుల్లో 74 మ్యాచ్‌లు.. ఫైనల్ ఎప్పుడంటే..!


ఐపీఎల్ 2025 హంగామా మొదలైంది. క్రికెట్ అభిమానులు ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ ఎడిషన్ షెడ్యూల్ వచ్చేసింది. మార్చి 22న ఈ సీజన్ మొదలు కానుంది. 65 రోజుల పాటు కొనసాగునున్న ఈ సీజన్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. లీగ్ దశ మే 18వ తేదీతో ముగుస్తుంది. ప్లే ఆఫ్స్ మే 20 నుంచి 25 వరకు జరుగుతాయి. మే 25వ తేదీన కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. క్వాలిఫైయర్ 2 మ్యాచ్‌కు కూడా ఇదే వేదిక ఆతిథ్యం ఇవ్వనున్నది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, ఇంతవరకూ ట్రోఫీ గెలవని జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. తొలి మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. గత ఏడాది రన్నరప్‌గా నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మార్చి 23వ తేదీన తన సొంత మైదానం (ఉప్పల్ స్టేడియం) లోనే రాజస్థాన్‌తో తలపడనుంది.

### కొత్త వేదికల్లో మ్యాచులు..

ఐపీఎల్ 2025 సీజన్‌లో గతంలో మాదిరిగానే 10 వేదికల్లో మ్యాచులు జరుగుతాయి. అలాగే, ఈ సారి ఐపీఎల్ మ్యాచులకు ఈ సారి కొత్త వేదికల్లోనూ పలు మ్యాచులు నిర్వహించనున్నారు. ఈ సారి మ్యాచులు అహ్మదాబాద్, ముంబయి, చెన్నై, బెంగళూరు, లక్నో, ముల్లన్‌పూర్, ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, హైదరాబాద్, గువాహటి, ధర్మశాలలో జరుగుతాయి. రాజస్థాన్ రాయల్స్ గువాహటిని రెండో హోంగ్రౌండ్‌గా ఎంపిక చేసుకుంది. మార్చి 26, 30 తేదీల్లో ఇక్కడ రెండు మ్యాచులు జరుగనున్నాయి. రాజస్థాన్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచులు ఆడుతుంది. పంజాబ్ కింగ్స్ తన మూడు హోం మ్యాచ్‌లను ధర్మశాలలో ఆడనుండగా.. మిగిలిన హోం మ్యాచ్‌లు పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్‌లో ఆడనున్నాయి.

# సిన్నర్‌పై నిషేధం

## డోపింగ్‌లో చిక్కుకున్న వరల్డ్ నంబర్‌వన్



**లండన్:** ప్రపంచ నంబర్‌వన్, ఇటలీ టెన్నిస్ స్టార్ జానిక్ సిన్నర్‌పై మూడు నెలల నిషేధం పడింది. నిషేధిత ఉత్ప్రేరకాలు తీసుకున్న కారణంగా అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(వాడా) సిన్నర్‌పై మూడు నెలల పాటు నిషేధం విధిస్తూ శనివారం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఏడాది పాటు నిషేధం విధించాల్సి ఉన్నా ..తాను ఉద్దేశపూర్వకంగా తీసుకోలేదన్న సిన్నర్ వాడా నిర్ణయాన్ని ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ(ఐటీఐఏ)లో సవాల్ చేశాడు. దీంతో సిన్నర్ వాదనతో ఏకభవించిన ఐటీఐఏ.. అతనిపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో ఐటీఐఏ నిర్ణయాన్ని సవాలు చేస్తూ స్విట్జర్లాండ్‌లోని కోర్ట్ ఆఫ్ అర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ లో సవాలు చేసిన వాడా పిటీషన్ వాపస్ తీసుకుంది. ఇందులో భాగంగా మూడు నెలల పాటు సస్పెన్షన్‌కు సిన్నర్‌కు అంగీకారం తెలపడంతో వాడా ఈ నిర్ణయానికి వచ్చింది.



# భారత్‌దే గెలుపు

## మహిళల ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్

**భువనేశ్వర్:** స్వదేశం వేదికగా జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్‌లో భారత మహిళల హాకీ జట్టు అదిరిపోయే విజయంతో ఆకట్టుకుంది. శనివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 32తో ఇంగ్లండ్‌పై అద్భుత విజయం సాధించింది. తమ(9) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్(7)ను భారత్ మెరుగ్గా నిలువరించింది. వైష్ణవి ఫాల్కె(6ని), దీపిక(25ని) పెనాల్టీ కార్నర్ గోల్స్ చేయగా, మ్యాచ్ ఆఖరి నిమిషంలో నవనీత్‌కౌర్(59ని) గోల్‌తో భారత్ విజయం ఖరారైంది. డార్కీ బౌర్నె(12ని), ఫియోనా క్రాకల్స్(58ని) ఇంగ్లండ్‌కు గోల్స్ అందించారు.

**పురుషుల జట్టుకు పరాజయం**

ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో ఓవైపు అమ్మాయిలు అదరగొడుతుంటే..అబ్బాయిలు పేలవ ప్రదర్శన కనబరిచారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 13 తేడాతో స్పెయిన్ చేతిలో ఓటమిపాలైంది.

# శ్రేయాంక స్థానంలో స్నేహ్‌రానా

**బెంగళూరు:** గాయం కారణంగా వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సీజన్‌కు పూర్తిగా దూరమైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ స్థానంలో స్నేహ్‌రానా జట్టులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని శనివారం ఆర్‌సీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. 30 లక్షల ధరతో స్నేహ్‌రానా..ప్రస్తుత సీజన్‌లో ఆర్‌సీబీకి ఆడనుంది. గాయం కారణంగా ఇటీవల స్వదేశంలో వెస్టిండీస్, ఐర్లాండ్‌తో పా టు తాజాగా డబ్ల్యూపీఎల్‌కు శ్రే యాంక పూర్తిగా దూరమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆర్‌సీబీ.. తమ తొలి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయంతో బోణీ కొట్టిన సంగతి తెలిసిందే.






# గుల్వీర్‌సింగ్ నయా రికార్డు

**న్యూఢిల్లీ:** హాంగ్జౌ(చైనా) ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత గుల్వీర్‌సింగ్ నయా రికార్డు నెలకొల్పాడు. బోస్టన్ వేదికగా జరిగిన బీయూ డేవిడ్ హెమ్రె వాలెంటైన్ ఇన్విటేషనల్ టోర్నీలో గుల్వీర్ సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. పురుషుల 3000మీటర్ల ఇండోర్ రేసును గుల్వీర్ 7:38:26సెకన్లలో ముగించి 16 ఏండ్ల క్రితం సురేందర్‌సింగ్(7:49:47సె) రికార్డును తిరగరాశాడు. చివరివరకు ఆసక్తికరంగా సాగిన రేసులో గుల్వీర్ రెండో స్థానంతో ముగించాడు. బోస్టన్ రాణించడం ద్వారా ఈ ఏడాది జరుగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీకి నేరుగా అర్హత సాధించే అవకాశం లభించనుంది. ఇదిలా ఉంటే త్వరలో జరుగనున్న ఆసియా, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం స్కాట్ సిమన్స్ నేతృత్వంలో భారత అథ్లెట్లు శిక్షణ పొందుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com